Follow: @ANNTELUGU
01-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 124 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్

రాష్ట్ర మంత్రి హోదా.. ప్రొటోకాల్

అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

సీఎం రేవంత్ కు థ్యాంక్స్ చెప్పిన వీహెచ్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి. హన్మంతరావును బీసీ సంక్షేమ మరియు అభివృద్ధి విభాగంలో ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం, బీసీ సామాజిక వర్గాల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న వీహెచ్‌కు ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మిగతా 2లో

టాప్ న్యూస్

### జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూన్ 16 వరకు గడువు పొడిగింపు

- హైకోర్టు ఆదేశాలు



02

### బీఆర్ఎస్ పార్టీ ఓ చచ్చిన పాము

- ఎంపీ లక్ష్మణ్ ఫైర్



02

### డబ్బుతో కొనేశారు

- ఎగ్జిట్ పోల్స్ పై మమతా బెనర్జీ ఫైర్
- 226 సీట్లు గెలుస్తామని ధీమా



02

# కవిత చాణక్యం



## పార్టీ పేరు ఎంపికతోనే మాస్టర్ స్ట్రోక్

"టీఆర్ఎస్"కు ఈసి లైన్ క్లియర్ తో ఖంగుతిన్న ప్రత్యర్థులు

తెలంగాణ రక్షణ సేనతో సెన్సేషన్

టీఆర్ఎస్ నాకు రాసిపెట్టిందేమో.. లైన్ క్లియర్ పై కవిత హర్షం

**హైదరాబాద్, మహా :**

తెలంగాణ పాలిటిక్స్ లో కేసీఆర్ కు అపర చాణక్యుడిగా పేరుండగా, ఇపుడు కవిత పార్టీ ఆరంభం నుండి ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు ఇస్తున్నారు. సర్ ప్రైజ్ లతో ఆశ్చర్యపరుస్తున్నారు. కేసీఆర్ తరహాలో చివరిక్షణం దాకా రహస్యాన్ని, నిర్ణయాలని బిగపట్టి.. ఆశ్చర్యకరంగా ప్రకటిస్తున్నారు. పేరుతో ఎంత సంచలనం క్రియేట్ చేసిందో.. ఇపుడు ఈసీ నుండి లైన్ క్లియర్ చేసుకోవడం ద్వారా కవిత చాణక్యం, వ్యూహం, రాజకీయ ఎత్తుగడలు ప్రస్ఫుటమయ్యాయి. రాజకీయ పార్టీ పేరు ప్రకటనతోనే తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. స్వాభిమానం ఎక్కువగా ఉన్న కల్వకుంట్ల కవిత తన తండ్రి వద్దు అని అనుకున్న టీఆర్ఎస్ పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోరని అందరూ అనుకున్నారు. కుటుంబ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యాక పాత వాసనలు అసలే వద్దు అని నిర్ణయించుకుంటారని భావించారు. ఇక్కడే తన రాజకీయ చాణక్యాన్ని కవిత ప్రదర్శించారు. భేషజాలకు పోకుండా రాజకీయ పార్టీ పేరు ఎంపికలో ఆచితూచి వ్యవహరించారు. ముందుగానే హింట్ ఇచ్చి మరీ షాకిచ్చారు. సంక్షిప్తంగా "టీఆర్ఎస్" అని వచ్చేలా "తెలంగాణ రక్షణ సేన" పార్టీ పేరుకు అధికారిక అనుమతులు సొంతం చేసుకున్నారు. కొద్దిపాటి సాంకేతిక ప్రక్రియ తర్వాత టీఆర్ఎస్ పేరుతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లనున్నారు.

మిగతా 2లో

### ఎత్తుగడలు కేసీఆర్ తరహాలోనే...

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత ఫక్తు రాజకీయ పార్టీగా మారే క్రమంలో అపభ్రంశం చెందింది. తమకు పేటెంట్ గా ఉన్న తెలంగాణ అస్తిత్వాన్ని వదిలేసి దేశాన్నే మార్చేస్తామంటూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గా రూపాంతరం చెందింది. ఉద్యమ నాయకుడు కేసీఆర్ సేనానిగా ఉన్నా, పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చడాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని అధికారం నుంచి దించేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో టీఆర్ఎస్ చాలా పాపులర్. ప్రజలకు ఈ పేరు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. టీఆర్ఎస్ పేరును సొంతం చేసుకోవడం ద్వారా తెలంగాణ స్వీయ అస్తిత్వ పరిరక్షణకు పాటు పడే ఏకైక స్థానిక పార్టీ తమదేనని కవిత బలంగా చెప్పుకుంటున్నారు. ఈసీ అనుమతి తర్వాత చేసిన ట్వీట్ లోనూ "టీఆర్ఎస్" తనకు రాసిపెట్టి ఉందేమోనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ జాతీయ పార్టీలే... తెలంగాణ పేరుతో ఒక్కటంటే ఒక్క ప్రధాన ప్రాంతీయ పార్టీ కూడా తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై లేదు. తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోన్న ప్రస్తుత తరుణంలో టీఆర్ఎస్ పేరుతోనే ప్రజల్లోకి వెళ్లాలని కవిత నిర్ణయించారు. ఆమె సంకల్పానికి దైవ బలం కూడా తోడు కావడం వల్లే టీఆర్ఎస్ పార్టీ పేరును ఖరారు చేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మంగ్లీ బ్రాండ్ తో వందల కోట్ల గ్రే గేమ్!

## జానపద గీతం.. వందల కోట్ల స్కామ్ నైవేద్యం



### గోకులానందన మాయాజాలం!

బాధితుల కన్నీటి గాథలు, ఆత్మహత్యల వెనుక అసలు నిజాలు

కర్ణాటక మాజీ మంత్రి మనవడి నుంచి రూ. 80 లక్షలు వసూల్

గిరిజన జేఏసీ సంచలన ఆరోపణలు, తెరవెనుక బడా రాజకీయ శక్తులు

21 ఏళ్ల కుర్రాడు.. 150 కోట్ల కుంభకోణం.. దుబాయ్ దాకా 'హవాలా' మూలాలు!

గిరిజన బిడ్డల కన్నీటి గాథ.. సెలబ్రిటీల లగ్జరీ లైఫ్ వెనుక 'నయవంచన'!

హైదరాబాద్, మహా బ్యూరో: సమాజంలో సెలబ్రిటీలకు ఉండే ఆదరణను, సామాన్యులకు వారిపై ఉండే గుడ్డి నమ్మకాన్ని పెట్టుబడిగా మార్చుకుని సాగించిన ఒక భారీ ఆర్థిక విధ్వంసం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేస్తోంది. ప్రముఖ గాయని మంగ్లీ (సత్యవతి రాథోడ్) బ్రాండ్ అంబాసిడర్‌గా, ఆమె సోదరుడు శివ చౌహాన్ కీలక పాత్రధారిగా వెలుగులోకి వచ్చిన "గోకులానందన ఇన్‌ఫ్రా", "శుభాక్షేత్ర" మైక్రో ఫైనాన్స్ కుంభకోణం.. కేవలం పది కోట్ల చిల్లర వ్యవహారం కాదు, ఇది ఏకంగా రూ. 150 కోట్లకు పైగా విస్తరించిన అంతర్జాతీయ హవాలా నెట్‌వర్క్ అని పోలీసు దర్యాప్తులో తేలుతోంది. ఒకవైపు 21 ఏళ్ల కాలేజ్ డ్రాపౌట్ రమావత్ మధు పబ్‌లు, స్పాలు, ఐపీఎల్ బెట్టింగ్‌లతో ఎంజాయ్ చేస్తుంటే.. మరోవైపు తమ జీవితకాల పొదుపును నమ్మి పోగొట్టుకున్న గిరిజన బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. న్యాయపోరాటం చేస్తున్న అడ్వకేట్ సుబ్బారావుపై మంగ్లీ కౌంటర్ కేసులు పెట్టడం, రాజకీయ ఒత్తిళ్లు పెరగడం ఈ కేసును మరో మలుపు తిప్పింది. టాలీవుడ్ ప్రముఖుల ప్రమేయం, పంజాగుట్ట సెటిల్మెంట్లు, దుబాయ్ లింకులు.. ఇలా ప్రతి అంశం ఈ స్కామ్‌లో ఒక సంచలన రహస్యాన్ని విప్పుతోంది. ఈ 'మాయా' వెంచర్ వెనుక ఉన్న అసలు కింగ్ పిన్స్ ఎవరు? బాధితులకు న్యాయం జరిగేదెన్నడు? అనే అంశాలపై 'మహా' పత్రిక ప్రత్యేక కథనం. పేజీ 4లో

### నమ్మకమే ఉరితాడు

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. కూతురి పెళ్లి కోసమో, కొడుకు పైచదువుల కోసమో, వృద్ధాప్యంలో ఆసరా ఉంటుందనో కడుపు కట్టుకుని పైసా పైసా కూడబెట్టుకున్నారు. 'మన గిరిజన బిడ్డ, మన తండా నుంచి వచ్చిన సొంత మనిషి' అని ఒక ప్రముఖ గాయనిపై పెట్టుకున్న గుడ్డి నమ్మకం... నేడు వారి పాలిట ఉరితాడుగా మారింది. మైక్రో ఫైనాన్స్ పేరుతో వందల కోట్ల రూపాయలు దిగమింగిన 'గోకులానందన ఇన్‌ఫ్రా' కుంభకోణం, ఎంతోమంది సామాన్యుల జీవితాల్లో ఊహించని పెను విషాదాన్ని నింపింది. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులు తీర్చలేక, మోసపోయామన్న అవమాన భారంతో కొందరు తండ్రులు అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకుంటుంటే... దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. రమావత్ రమేష్ లాంటి బాధితుల భార్యలు తమ భర్త మరణానికి కారణం మంగ్లీ, మధులేనంటూ రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. జానపద గీతాలతో కోట్లాది మందిని ఉర్రూతలూగించిన సింగర్ మంగ్లీ (సత్యవతి రాథోడ్) చుట్టూ అల్లుకున్న ఈ చీకటి సామ్రాజ్యంలో, చివరకు బలైపోయింది మాత్రం అమాయక పేద గిరిజన, బంజారా బిడ్డలే.

## అభివృద్ధి పండుగలా ప్రధాని మోదీ పర్యటన

### రూ. 7,823 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

దక్షిణ భారత్ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోంది

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై కిషన్ రెడ్డి ఫైర్




**హైదరాబాద్, మహా:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మే నెల 10వ తేదీన తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. గత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీపై చూపిన అపార విశ్వాసం వల్ల పార్టీ రాష్ట్రంలో గణనీయంగా బలపడిందని, సుమారు 40 లక్షల మంది కొత్త సభ్యులు పార్టీలో

మిగతా 2లో

సంక్షేమ పథకాలు లబ్ధిదారుల కోసమే..

## సరఫరాదారుల కోసం కాదు!

### వస్తువుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దు

కొనుగోళ్లన్నీ 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్' ద్వారానే జరగాలి

సరఫరా పర్యవేక్షణకు మండల స్థాయిలో నోడల్ అధికారులు

సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మహా:** సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే వస్తువులు, పథకాల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా

మిగతా 2లో

## ట్రంప్‌కు పుతిన్ ఘాటు హెచ్చరిక

ఇరాన్‌పై దాడికి దిగవద్దని రష్యా అల్టిమేటం

యురేనియం నిల్వలపై రష్యా మధ్యవర్తిత్వం

ఇరాన్ అణు ముప్పును తప్పించే దిశగా కొత్త వ్యూహం

ఉక్రెయిన్ యుద్ధం ఆపితేనే 'ఇరాన్ డీల్'

'పుతిన్ ముందు ట్రంప్ కఠిన షరతు



**హైదరాబాద్, మహా:** అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తున్న తరుణంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రంగంలోకి దిగారు. ఇరాన్‌పై మరోసారి సైనిక దాడులకు దిగవద్దని ట్రంప్‌ను పుతిన్ నేరుగా హెచ్చరించారు. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌పై దాడులు చేస్తే అంతర్జాతీయంగా పెను పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ రష్యాకు కీలక మిత్రదేశమని, ఆ దేశ భద్రత విషయంలో తమ ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పుతిన్ గుర్తు చేశారు.

మిగతా 2లో

## మంగ్లీకి బిగుస్తున్న ఉచ్చు

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న వందల కోట్ల మైక్రో ఫైనాన్స్ స్కామ్‌లో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసు దర్యాప్తులో పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ప్రముఖ జానపద గాయని మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్ లావాదేవీలపై సైబరాబాద్ పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రమావత్ మధు అకౌంట్ నుంచి శివ చౌహాన్ ఖాతాకు నగదు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం మూడు విడతల్లో మధు డబ్బులు పంపినట్లు బ్యాంక్ స్టేట్‌మెంట్ల ద్వారా స్పష్టమైంది. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. శివ చౌహాన్ అకౌంట్లోకి డబ్బులు జమ అయిన తర్వాతి రోజే ఆ నగదును విత్ డ్రా (నగదు ఉపసంహరణ) చేసినట్లు విచారణలో తేలింది.

**బ్యాంకులకు పోలీసుల లేఖ..**

ఈ వ్యవహారంలో పక్కా ఆధారాల కోసం సైబరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు రమావత్ మధు బ్యాంక్ అకౌంట్‌ను సీజ్ చేసిన అధికారులు.. పూర్తి వివరాల కోసం బ్యాంక్ యాజమాన్యాలకు లేఖలు రాశారు. రమావత్ మధుతో పాటు హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌లకు చెందిన బ్యాంక్ ఖాతాల స్టేట్‌మెంట్లు, నగదు లావాదేవీల పూర్తి నివేదికను ఇవ్వాలని పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో తమకు ఎలాంటి సంబంధం లేదని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఇప్పటికే మీడియా వేదికగా ప్రకటించారు. అయితే, నిందితుడి ఖాతా నుండి నగదు బదిలీ అయినట్లు పోలీసులు విచారణలో తేలడంతో ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం కనిపిస్తోంది. మైక్రో ఫైనాన్స్ పేరుతో అమాయక ప్రజల నుండి వసూలు చేసిన సొమ్ము ఎక్కడికి మళ్లింది? దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పండుగలా ప్రధాని మోదీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

చేరారని ఆయన పేర్కొన్నారు. మోదీ నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకానికి ఈ సభ్యత్వాలే నిదర్శనమని, ఈ పర్యటన సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభ ద్వారా ప్రధాని ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతారని వెల్లడించారు.

**రవాణా రంగంలో విప్లవాత్మక పురోగతి**

తెలంగాణలో రవాణా మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని కిషన్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే పనులు జరుగుతున్నాయని, కాజీపేటవిజయవాడ మూడో లైనుతో పాటు పలు రైల్వే బైపాస్ లైన్లు పూర్తయ్యాయని తెలిపారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణకు టెండర్లు పూర్తయ్యాయని, భూసేకరణ ముగియగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జాతీయ రహదారుల విషయంలో కూడా తెలంగాణకు పెద్దపీట వేస్తున్నామని, త్వరలోనే ఢిల్లీలో జరిగే సమావేశంలో మరిన్ని కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తీసుకువస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**విద్యా, పరిశోధన రంగాలకు ప్రాధాన్యం**

తెలంగాణను విద్యా హబ్‌గా మార్చే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ములుగులో ఏర్పాటు చేస్తున్న సమ్మక్కసారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి వెయ్యి కోట్ల రూపాయల నిధులను కేంద్రం మంజూరు చేసిందని, భూమి బదిలీ ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలోనే శాశ్వత క్యాంపస్ పనులు మొదలవుతాయని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని తార్నాకలో 400 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నేషనల్ సైన్స్ సెంటర్ నిర్మాణం జరుగుతోందని, ఇది డిఫెన్స్, ఫార్మా మరియు ఐటీ రంగాల పరిశోధనలకు ఎంతో కీలకంగా మారుతుందని వివరించారు.

**పారిశ్రామిక కారిడార్ - ఉపాధి కల్పన**

జహీరాబాద్ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దుతున్నామని కిషన్ రెడ్డి వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 'ప్లగ్ అండ్ ప్లే' మోడల్‌లో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని, దీని ద్వారా సుమారు 10 లక్షల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రాంతానికి కనెక్టివిటీ మెరుగ్గా ఉంటుందని, పరిశ్రమలు నేరుగా వచ్చి తమ ఉత్పత్తిని ప్రారంభించేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా అభివృద్ధిని జిల్లాలకు విస్తరింపజేయడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

**వరంగల్ టెక్స్ టైల్ మరియు 5F కాన్సెప్ట్**

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా వస్త్ర రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న "5F" కాన్సెప్ట్ ద్వారా రైతు పండించిన పత్తి నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌కు చేరుతుందని వివరించారు. ఈ పార్కు ద్వారా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని, ఇప్పటికే కొరియాకు చెందిన యంగ్ వన్ వంటి మల్టీనేషనల్ కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయని చెప్పారు. 2030 నాటికి 9 లక్షల కోట్ల రూపాయల విలువైన టెక్స్‌టైల్ ఎగుమతులు సాధించాలనే లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**రాజకీయ కుట్రలు - డీలిమిటేషన్ ఆవశ్యకత**

మహిళా రిజర్వేషన్ , నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరును కిషన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. డీలిమిటేషన్ జరిగితే దక్షిణ భారతదేశంలోని లోక్‌సభ సీట్ల సంఖ్య 129 నుండి 195కు పెరిగే అవకాశం ఉండేదని, తద్వారా దళితులు, గిరిజనులు మరియు మహిళలకు రాజకీయంగా పెద్దపీట వేయవచ్చని ఆయన వివరించారు. మల్కాజిగిరి వంటి లక్షల సంఖ్యలో ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో సమతుల్యత సాధించాలంటే సీట్ల పెంపు తప్పనిసరని, కానీ కాంగ్రెస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అభివృద్ధిని అడ్డుకుంటోందని మండిపడ్డారు. దేశాభివృద్ధిలో అడ్డుపడుతున్న ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు అందిస్తున్న ఈ భారీ ప్రాజెక్టులు రాష్ట్ర రూపురేఖలను మార్చనున్నాయని, మే 10న జరిగే బహిరంగ సభకు ప్రజలందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కవిత చాణక్యం

(మొదటిపేజీ తరువాయి)

కవిత తమ పార్టీ పేరు టీఆర్ఎస్ అని ప్రకటించగానే బీఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ ఉలిక్కి పడింది. కవిత పార్టీ పేరుతో ఆమె పాంచజన్యం పేరుతో ప్రకటించిన ఎజెండా తమ పీఠాలు కదిలిస్తుందనే ఆందోళనతో కవితపై ఎదురుదాడికి దిగింది. రాష్ట్ర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు సహా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవిత వ్యాఖ్యలపై ఇంతెత్తున ఎగిరి పడ్డారు. కన్న తండ్రినే నిందించిన కవిత రాష్ట్ర ప్రజలకు అమ్మ ఎలా అవుతుందని ప్రశ్నిస్తూ వ్యక్తిత్వ హననం చేసేందుకు ప్రయత్నించారు. ఒకానొక దశలో బీఆర్ఎస్ కు మించి కవితపై మాటల దాడి చేశారు. కవితకు టీఆర్ఎస్ అనే పేరు దక్కకూడదని పలువురు ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో పాటు అడ్డుకుంటామని బహిరంగ ప్రకటనలు చేశారు. టీఆర్ఎస్ రాదని, కవితకు వ్యూహం లేదని బీఆర్ఎస్ పెద్దలు కొందరు ట్వీట్లేశారు. వారందరికీ షాకిచ్చేలా టీఆర్ఎస్ పేరును ఖరారు చేస్తూ ఈసీ ఆమోదముద్ర వేయడం తెలంగాణ రాజకీయాలను ఆసక్తికరంగా మార్చింది. కవిత నోటినుండి మాట వస్తే అది అయితీరుతుందని రుజువుచేసింది. పార్టీ ప్రకటించిన తర్వాత రకరకాల చర్చలు చేసిన వారందరికీ ఒక్క కాగితంతో ఐదురోజుల్లోనే మైండ్ బ్లాక్ చేసింది.

## సంక్షేమ పథకాలు లబ్ధిదారుల కోసమే..
## సరఫరాదారుల కోసం కాదు!

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమైన ఆయన.. విద్యార్థుల వసతులు, కొనుగోళ్ల విషయంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**లబ్ధిదారుల ప్రయోజనాలే ముఖ్యం..**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలు కేవలం లబ్ధిదారుల కోసం మాత్రమేనని, వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల కోసం కాదని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని ప్రతి అధికారి కచ్చితంగా గుర్తుంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యమైన వస్తువులను అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసే దుస్తులు, పుస్తకాలు, నోట్ బుక్స్ తదితర వస్తువుల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, నాసిరకం వస్తువులు ఇస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

**కొనుగోళ్లలో పారదర్శకత..**

సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు అవసరమైన వస్తువులన్నింటినీ ఇకపై 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్' (కేంద్రీకృత కొనుగోలు) విధానం ద్వారానే సేకరించి, విద్యార్థులకు నేరుగా అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీని ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత వస్తుందని స్పష్టం చేశారు.

**మండల స్థాయిలో నోడల్ అధికారులు..**

విద్యార్థులకు వస్తువుల సరఫరాలో ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వస్తువుల పంపిణీ సజావుగా సాగేలా ఈ నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## డబ్బుతో కొనేశారు

**కోల్ కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందంటూ వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌ను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. అవన్నీ బూటకమని, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ (బీజేపీ) డబ్బులు ఇచ్చి, ఒత్తిడి చేసి మీడియా సంస్థల ద్వారా వాటిని ప్రసారం చేయించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు గురువారం తన సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోకుండా నిరోధించడం, మే 4న జరిగే ఓట్ల లెక్కింపునకు ముందే తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ఉద్దేశమని మమత వివరించారు. "నిజానికి తృణమూల్ 226 నుంచి 230కి పైగా స్థానాలు గెలుస్తుందని బీజేపీకి అర్థమైంది. అందుకే మీడియాను అడ్డం పెట్టుకుని ఈ పని చేశారు. బుధవారం మధ్యాహ్నం 1:08 గంటలకు ఎగ్జిట్ పోల్ అంచనాలను మీడియా సంస్థలకు పంపినట్లు నా వద్ద కచ్చితమైన సమాచారం ఉంది" అని ఆమె అన్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూన్ 16 వరకు గడువు పొడిగింపు



**హైకోర్టు ఆదేశాలు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ హైకోర్టు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూన్ 16 వరకు పొడిగించింది.జీ .వో 252 మరియు దాని సవరణ అయిన జీవో. 103ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సహా మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ, విచారణ కొనసాగుతున్నంత వరకు అక్రిడిటేషన్ సదుపాయాలను కొనసాగించాలని వారు కోరారు. పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు.విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక నెలపాటు కార్డుల గడువు పొడిగించాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే, అది సమ్మర్ సెలవులతో సరిపోతుందని గమనించిన కోర్టు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గడువును జూన్ 16 వరకు పొడిగించింది. ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు అన్నీ 2026 జూన్ 16 వరకు చెల్లుబాటు అవుతాయా. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు సమయం ఇచ్చింది.

**జర్నలిస్టులకు తాత్కాలిక ఊరట**

ఈ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు అధికారిక కార్యక్రమాలకు అంతరాయం లేకుండా హాజరవుతారు. అలాగే అక్రిడిటేషన్ కు సంబంధించిన అన్ని ప్రయోజనాలు కూడా కొనసాగుతాయి. దీంతో వారి వృత్తిపరమైన పనుల్లో ఎలాంటి ఆటంకం ఉండదు. ఇక ఫెడరేషన్ తరఫున ఒక ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అందులో, వచ్చిన దరఖాస్తుల సంఖ్య, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తులు మరియు వాటి కారణాల వివరాలను కోర్టు ముందు ఉంచాలని కోరారు. ఈ అంశాన్ని తదుపరి విచారణలో కోర్టు పరిశీలించనుంది.ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.కోర్టు తదుపరి విచారణను జూన్ 16, 2026కు వాయిదా వేసింది. ఆ విచారణలో ఈ ప్రభుత్వ ఆదేశాల భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకోనుంది.ఈ పరిణామం రాష్ట్రంలోని మీడియా వర్గాలకు ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఇది వారి పనిలో స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు, అక్రిడిటేషన్ విధానాలపై కొనసాగుతున్న ఆందోళనలను కూడా వెలుగులోకి తెచ్చింది

## ట్రంప్‌కు పుతిన్ ఘాటు హెచ్చరిక

(మొదటిపేజీ తరువాయి)

ఈ హెచ్చరికతో అమెరికారష్యా మధ్య దౌత్యపరమైన వేడి ఒక్కసారిగా పెరిగింది.

**యురేనియం నిల్వలపై రష్యా ప్రతిపాదన**

ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలు ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రష్యా ఒక వినూత్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకునేందుకు, ఆ దేశం వద్ద ఉన్న మొత్తం యురేనియం నిల్వలను తామే తీసుకుంటామని రష్యా ప్రకటించింది. ఈ నిల్వలను రష్యాకు తరలించడం ద్వారా ఇరాన్ అణు కార్యక్రమంపై ఉన్న అంతర్జాతీయ అనుమానాలను పటాపంచలు చేయవచ్చని పుతిన్ భావిస్తున్నారు. ఈ చర్య వల్ల అటు ఇరాన్ భద్రతకు భంగం కలగకుండా, ఇటు అమెరికా ఆందోళనలను తగ్గించే అవకాశం ఉంటుందని రష్యా దౌత్య వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ట్రంప్ షరతుతో మారిన సమీకరణాలు**

రష్యా చేసిన యురేనియం ప్రతిపాదనపై డోనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ఇరాన్ యురేనియం నిల్వలను రష్యా తీసుకోవడానికి తాము అంగీకరించాలంటే ఒక ప్రధాన షరతును విధించారు. ప్రస్తుతం రష్యాఉక్రెయిన్ మధ్య సాగుతున్న సుదీర్ఘ యుద్ధాన్ని వెంటనే నిలిపివేస్తేనే ఈ డీల్‌కు తాము మొగ్గు చూపుతామని ట్రంప్ స్పష్టం చేశారు. ఒకే దెబ్బకు రెండు అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించాలనేది ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికితేనే ఇరాన్ విషయంలో రష్యాకు సహకరిస్తామని అమెరికా తేల్చి చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ఉక్రెయిన్ యుద్ధంపై డీల్ ప్రభావం**

ట్రంప్ విధించిన షరతు ఇప్పుడు పుతిన్‌ను ఆత్మరక్షణలో పడేసింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడం ద్వారా తన రక్షణ వ్యూహాలను మార్చుకోవాల్సి వస్తుంది, అదే సమయంలో ఇరాన్ అణు నిల్వల బాధ్యత తీసుకుంటే మధ్యప్రాచ్యంలో రష్యా ఆధిపత్యం పెరుగుతుంది. ఈ రెండింటిలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలనే విషయంలో రష్యా తీవ్రంగా మల్లగుల్లాలు పడుతోంది. ఉక్రెయిన్‌లో పట్టు కోల్పోకుండానే ఇరాన్ డీల్‌ను పట్టాలెక్కించాలని పుతిన్ యోచిస్తున్నారు. మరోవైపు ట్రంప్ మాత్రం యుద్ధం ఆగనిదే ఎటువంటి రాయితీలు ఇచ్చే ప్రసక్తే లేదని మొండిగా ఉన్నారు.

**అంతర్జాతీయ భద్రత, అణు ముప్పు**

ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలు అణ్వాయుధ తయారీకి సరిపడా ఉన్నాయని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ గతంలోనే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆ నిల్వలను రష్యా వంటి బాధ్యతాయుత దేశం స్వాధీనం చేసుకోవడం వల్ల ప్రపంచానికి అణు ముప్పు తప్పుతుందని భద్రతా నిపుణులు భావిస్తున్నారు. అయితే అమెరికా ఈ ప్రక్రియను ఉక్రెయిన్ యుద్ధంతో ముడిపెట్టడం వల్ల ఈ పరిష్కారం మరింత క్లిష్టంగా మారింది. ఇరాన్ సైతం తన అణు నిల్వల తరలింపునకు రష్యా ఇచ్చే రక్షణ హామీలపై ఆధారపడి ఉంది. అగ్రరాజ్యాల మధ్య జరిగే ఈ డీల్ సాకారమైతేనే ప్రపంచంలో నెలకొన్న రెండు ప్రధాన యుద్ధ మేఘాలు తొలగిపోయే అవకాశం ఉంది.

**దౌత్య పరిష్కారం దిశగా అడుగులు**

ప్రస్తుతానికి ట్రంప్, పుతిన్ మధ్య ఈ ప్రతిపాదనలు చర్చల స్థాయిలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఇవి కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. రష్యా ప్రతినిధులు అమెరికా దౌత్యవేత్తలతో రహస్య చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇరాన్ విషయంలో అమెరికా దూకుడు తగ్గించడం, ఉక్రెయిన్‌లో రష్యా దాడులు నిలిపివేయడం అనేవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. ఈ క్లిష్టమైన రాజకీయ చదరంగంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది రాబోయే రోజుల్లో తేలనుంది. అంతర్జాతీయ సమాజం మాత్రం యుద్ధాలు ఆగి శాంతి నెలకొనాలని, అణు వ్యాప్తికి అడ్డుకట్ట పడాలని కోరుకుంటోంది.

## ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గవర్నర్ పేరిట బుధవారం జీఓ ఎంఎస్ నంబర్ 560ని విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధి పథంలో వీహెచ్ అనుభవాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నియామకంలో హన్మంతరావుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర మంత్రిహోదాను కల్పించింది. ప్రోటోకాల్ విషయంలోనూ ఆయనకు సముచిత స్థానాన్ని కేటాయిస్తూ, వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లో ఆర్టికల్ 18 కింద ఆయన హోదాను ఖరారు చేసింది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఆయనకు విశిష్ట గౌరవం లభించనుంది. కేవలం పదవిని అప్పగించడమే కాకుండా, ఆయన కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పించింది. నెలకు ఒక లక్ష రూపాయల వేతనంతో పాటు, 50 వేల రూపాయల ప్రత్యేక అలవెన్స్, మరో 30 వేల రూపాయల విందు అలవెన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి తోడు అద్దె లేని ప్రభుత్వ నివాసం లేదా అద్దె భత్యం, సొంత కారు వాడితే కన్వేయన్స్ అలవెన్స్, ఇంధన ఖర్చులు వంటి వసతులను పొందుపరిచారు. పరిపాలనలో ఆయనకు తోడ్పాటు అందించేందుకు ఐఏఎస్ అధికారులకు సమానమైన సిబ్బందిని కూడా ప్రభుత్వం కేటాయించింది. ఒక ప్రైవేట్ సెక్రటరీ, ఒక డీఈఓ, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు మరియు వాహనంతో కూడిన డ్రైవర్‌ను నియమించారు. వీరికి అయ్యే వేతనాలు, ఇతర వ్యయాలను బీసీ సంక్షేమ శాఖ బడ్జెట్ నుంచి భరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీసీల స్థితిగతులను మెరుగుపరచడం, ప్రభుత్వ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరేలా ప్రణాళికలు రూపొందించడంలో వీహెచ్ కీలక పాత్ర పోషించనున్నారు. ప్రజా క్షేత్రంలో ఉంటూ బీసీల గళంగా మారిన వీహెచ్‌కు ఈ పదవి దక్కడం వల్ల ప్రభుత్వానికి, సామాన్య ప్రజలకు మధ్య ఒక బలమైన వారధి ఏర్పడినట్లయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌కు,పార్టీ ముఖ్యనేతలకు ఆయన థ్యాంక్స్ చెప్పారు.

## బీఆర్ఎస్ పార్టీ ఓ చచ్చిన పాము




**.. ఎంపీ లక్ష్మణ్ ఫైర్**

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఓ చచ్చిపోయిన పాములాంటిదని బీజేపీ నేత, ఎంపీ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని వ్యాఖ్యానించారు. ఎంత లేపినా బీఆర్ఎస్ లేవదన్నారు. ప్రజలు నమ్మకంతో ప్రతిపక్ష హోదా ఇస్తే, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాకుండా ప్రజల సమస్యలు ప్రస్తావించకుండా, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయకుండా ప్రభుత్వంతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని విమర్శించారు. వాళ్లు ఒకరికొకరు లోపాయికార ఒప్పందం చేసుకుని సహకరించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణలో అజేయశక్తిగా ఎదుగుతుందని దొడ్డిదారిన అడ్డుకునే కుట్రలు పన్నుతున్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ తో కలిసి ఉద్యమంలో పనిచేశామని కానీ ఏ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికలైనా ఏ ఎన్నికలైనా ఒంటరిగానే పోటీ చేశామన్నారు. భవిష్యత్ లోనూ ఒంటరిగానే పోటీ చేస్తామని పొత్తులు ఉండవని స్పష్టం చేశారు.

## దటీజ్ చంద్రబాబు
### రియల్ రిఫార్మర్.. మంత్రుల ప్రశంసలు

**అమరావతి, మహా :** బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్2025' అవార్డు అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులకు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమం సీఎం చంద్రబాబు నాయకత్వ లక్షణాలు, ఆయన పనితీరు, దార్శనికతపై మంత్రులు చేసిన ఆసక్తికర వ్యాఖ్యలకు వేదికైంది. చంద్రబాబుతో కలిసి పనిచేయడంలో తమ అనుభవాలను, ఆయన నుంచి నేర్చుకున్న పాఠాలను మంత్రులు పంచుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. పెట్టుబడులు ఆకర్షించడంలో సీఎం చంద్రబాబు తమను పరుగులు పెట్టిస్తారని అన్నారు. "పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో సరిపెట్టకుండా, ఆ పరిశ్రమలు వాస్తవంగా కార్యకలాపాలు ప్రారంభించే (గ్రౌండింగ్) వరకు విశ్రమించవద్దని సీఎం పదే పదే గుర్తుచేస్తుంటారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండేందుకు, సమన్వయం కోసం ఏకంగా 90 మంది అధికారులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని పనిచేస్తున్నాం" అని ఆయన వివరించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు ముందుచూపును కొనియాడారు. "ఒకప్పుడు ఇంజనీరింగ్ చదువుల కోసం విద్యార్థులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని ఇంజనీరింగ్ కాలేజీలతో నింపి 'నాలెడ్జ్ ఎకానమీ'కి చంద్రబాబు పునాదులు వేశారు. ఆయన పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టినప్పుడు దాన్ని 'ఒట్టిసీమ' అని ఎంతోమంది విమర్శించారు. కానీ, అదే పట్టిసీమ రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించి విమర్శకుల నోళ్లు మూయించింది. దటీజ్ చంద్రబాబు" అంటూ ప్రశంసించారు. ఆయన నాయకత్వంలోనే రికార్డు స్థాయిలో హంద్రీనీవా జలాలను రాయలసీమకు తీసుకెళ్లామని గుర్తుచేశారు.వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తన అనుభవాలను సరదాగా పంచుకున్నారు. "సింగపూర్ అధ్యయన పర్యటనకు వెళ్లినప్పుడు, తిరిగొచ్చాక చంద్రబాబు ఏం ప్రశ్నలు అడుగుతారోనన్న భయంతో ఏడు రోజుల పాటు క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యాం. నేను కాలేజీ రోజుల్లో కూడా ఇంత సీరియస్‌గా చదువుకోలేదు. సింగపూర్‌లో మాత్రం భుజాన బ్యాగ్ వేసుకుని సీరియస్ స్టూడెంట్‌లా క్లాసులు విన్నాను" అని నవ్వుతూ చెప్పారు. ఇదే సమయంలో చంద్రబాబు సాధించిన ఓ అసాధారణ విజయాన్ని ఆయన గుర్తుచేశారు. "విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్రం నిర్ణయం తీసుకుంటే, సీఎం చంద్రబాబు వారిని ఒప్పించి ఏకంగా రూ.11 వేల కోట్లకు పైగా నిధులు ఇప్పించారు. అంత పెద్ద నిర్ణయంలో ప్రధాని మనసును ఆయన ఎలా మార్చారో ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది" అని వ్యాఖ్యానించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాజకీయాల్లో 'రిఫార్మర్' అనే పదానికి నిజమైన నిర్వచనం సీఎం చంద్రబాబు. తాను రిలాక్స్ అవ్వకుండా నిరంతరం పనిచేయడమే కాకుండా, తన బృందం కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన ఆశిస్తారు. అప్పుడే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండూ అందించగలమని ఆయన బలంగా నమ్ముతారు" అని తెలిపారు. మొత్తంగా ఈ విందు సమావేశం చంద్రబాబు నాయకత్వ పటిమ, పాలనలో ఆయనదైన మార్క్‌ను మరోసారి చాటిచెప్పింది.

## భువిపై వెలసిన స్వర్గాలు
### ప్రకృతి రమణీయతలో జపాన్‌దే అగ్రస్థానం!

ప్రపంచంలోని అత్యంత అందమైన 15 దేశాల జాబితా వెల్లడి
పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తున్న అద్భుత తీరాలు, పర్వతాలు
ఆసక్తికరమైన వివరాలను ప్రకటించిన ప్రముఖ మ్యాగజైన్ 'ట్రావెల్ అండ్ లీజర్'



**హైదరాబాద్, మహా:** సృష్టిలోని అందాలన్నీ ఒకేచోట కొలువుదీరితే ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని ప్రత్యేకమైన దేశాలకు వెళ్లాల్సిందే. ప్రకృతి ప్రసాదించిన పచ్చని తివాచీలు, మంచుకొండలు, సువిశాలమైన సముద్ర తీరాలు పర్యాటకులను నిరంతరం మంత్రముగ్ధులను చేస్తుంటాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి అందాలకు నెలవైన, అత్యంత రమణీయమైన దేశాల జాబితాను ప్రముఖ ప్రయాణ, పర్యాటక మ్యాగజైన్ 'ట్రావెల్ అండ్ లీజర్' తాజాగా వెల్లడించింది. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో ఆసియా ఖండానికి చెందిన జపాన్ అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా అగ్రస్థానంలో నిలిచి తన సత్తా చాటుకుంది. సూర్యుడు ఉదయించే భూమిగా పేరొందిన జపాన్ ప్రకృతి రమణీయతలో ప్రపంచ దేశాలను వెనక్కి నెట్టి ఏకంగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ జాబితాలో టాప్ పదిహేను స్థానాలను దక్కించుకున్న దేశాల వివరాలను నిశితంగా పరిశీలిస్తే ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒదిగి ఉన్న మన పొరుగు దేశం నేపాల్ అనూహ్యంగా రెండో స్థానంలో నిలిచి ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించింది. ఐరోపా ఖండంలోని ఇటలీ మూడో స్థానాన్ని దక్కించుకోగా, హిందూ మహాసముద్రంలోని పగడపు దీవుల సముదాయం మాల్దీవులు నాలుగో స్థానంలో నిలిచింది. ఆగ్నేయాసియా దేశమైన ఇండోనేషియా ఐదో స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది. మంచు అందాలకు చిరునామా అయిన ఐస్‌లాండ్ ఆరు, ఫ్రాన్స్ ఏడు, అమెరికా ఎనిమిది స్థానాల్లో నిలవగా.. భూతల స్వర్గంగా పేరుగాంచిన స్విట్జర్లాండ్ తొమ్మిది, కోస్టారికా పదో స్థానంలో నిలిచాయి. వీటితో పాటు పెరూ పదకొండు, బ్రిటన్ పన్నెండు, దక్షిణాఫ్రికా పదమూడు, టాంజానియా పద్నాలుగు, న్యూజిలాండ్ పదిహేనో స్థానంలో నిలిచి ప్రకృతి ప్రేమికులకు సాదర స్వాగతం పలుకుతున్నాయి. పర్యాటకుల అభిరుచులు, వారి ప్రయాణ శైలిని బట్టి ఏయే దేశాలు అత్యుత్తమమైనవో కూడా ఈ నివేదిక ప్రత్యేకంగా విశ్లేషించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా అగ్రస్థానంలో ఉన్న జపాన్‌ను ప్రకటించింది. బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని, కానీ అద్భుతమైన దాగి ఉన్న అందాల నిధిగా (అండర్ రేటెడ్ హిడెన్ జెమ్) నేపాల్‌ను అభివర్ణించింది. కుటుంబ సమేతంగా విహారయాత్రలకు వెళ్లి ఆహ్లాదకరంగా సెలవులు గడపాలనుకునే వారికి ఇటలీ అత్యుత్తమ ఎంపికగా సూచించింది. కొత్తగా పెళ్లైన జంటలు, ఏకాంతం కోరుకునే వారికి మాల్దీవులు మించిన స్వర్గం లేదని స్పష్టం చేసింది. ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టేయాలనుకునే సోలో ట్రావెలర్స్‌కు ఇండోనేషియా పర్యటన ఎంతో సురక్షితమైన, అద్భుతమైన అనుభూతినిస్తుందని 'ట్రావెల్ అండ్ లీజర్' మ్యాగజైన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. రాబోయే రోజుల్లో పర్యాటకులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవడానికి ఈ జాబితా ఎంతగానో ఉపయోగపడనుంది.

## పదవీవిరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి

**అదనపు డీసీపీ రవి**



**మహా వరంగల్ బ్యూరో ;** పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించాలని అదనపు డీసీపీ రవి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో సబ్ ఇన్స్ స్పెక్టర్లు, రాజయ్య, జైపాల్, ఆర్.ఎస్.ఐ యాదయ్య, ఏ. ఎస్. ఐలు దాసరయ్య, బుచ్చయ్య, గోపాల్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ నరహరి వున్నారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవాలందించిన పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని, పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని. పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు భద్రపర్చుకోవాలని అదనపు డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, ఆర్. ఐలు స్పర్జన్ రాజ్,సతీష్,శ్రీనివాస్, ఆర్.ఎస్. ఐ శ్రావణ్ కుమార్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్.. గురుకుల విద్యార్థులకు కలెక్టరేట్ లో సన్మానం**



**హనుమకొండ మహా ;** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పిలుపునిచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని తొమ్మిది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులను గురువారం కలెక్టరేట్ లో ఆమె ప్రత్యేకంగా అభినందించారు. మడికొండ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన కె. అలేఖ్య 571 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు కలెక్టర్ ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయ అధికారి ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్లు జిల్లాలోని గురుకుల పాఠశాలల ఉత్తీర్ణత వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రిన్సిపాలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభం**

ఎండల తీవ్రత దృష్ట్యా కలెక్టరేట్కు వచ్చే ప్రజలు, ఉద్యోగుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పేర్కొన్నారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. నీటితో పాటు అవసరమైన వారికి ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా ఖజానా అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఈర్డీవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస స్వామి, టీజీవో నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మాటలు నీటి మూటలు ఒకటే

- ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతు డిక్లరేషన్ పై బిఆర్ఎస్ పార్టీ పోరాటం
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**మహా వరంగల్ బ్యూరో;** హనుమకొండ బాల సముద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య తో కలిసి మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్ భాస్కర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, 6 గ్యారంటీ లు, 420 హామీలు అమలు అయ్యేంతవరకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. రైతులకు అమలు కాని హామీలు ఇచ్చి ఆ హామీలు అమలును మరిచి రైతుల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొట్టిందని మండిపడ్డారు. హనుమకొండ హంటర్ రోడ్ లోని ఓ ప్రయివేట్ స్థలంలో మే 6వ తేదీన రైతు సదస్సు నిర్వహించనున్నామని నరేందర్ తెలిపారు. అంతేకాకుండా 2027 లో రైతుల పక్షాన ఒక సభ, 2028లో మరో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. రైతు డిక్లరేషన్ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు, ప్రస్తుత మంత్రి సీతక్క రైతు డిక్లరేషన్ ప్రకటన సమయంలో వేదిక పై ఉన్నారని గుర్తు చేశారు. కాగా నాడు హామీ ఇచ్చిన సమయంలో ఉన్న నేతలు నేడు అమలు కోసం పాటు పడాలని సీతక్క రీల్ లైఫ్ నుంచి రియల్ లైఫ్ లోకి రావాలని రైతు డిక్లరేషన్ అమలుకు కృషి చేయాలని కోరారు.

**ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ...**

మే 6 2022న కాంగ్రెస్ పార్టీ రైతు సభ పెట్టి, రాహుల్ గాంధీ తో రైతు డిక్లరేషన్ ప్రకటన తో పాటు రుణమాఫీ చేస్తామని అప్పటి సభలో ప్రకటించారు. రాష్ట్రంలోని రైతులకు 50,000 కోట్లు రుణమాఫీ అవసరం కాగా అయితే కేవలం 20,000 కోట్లు మాత్రమే మాఫీ అయ్యిందని ఇప్పటికీ రుణమాఫీ పై ఎక్కడా స్పష్టత లేదని స్పష్టం చేశారు. ఎంత మందికి రైతులకు రుణమాఫీ చేశారు అంటే సమాధానం లేదని రుణమాఫీ 30 శాతం మించి జరగలేదని తెలిపారు. అంతేకాకుండా పంటలకు బోనస్ లేదని రైతు భరోసా 10 వేలు కాదు 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారని ముఖ్యంగా ఓరుగల్లు జిల్లాలో 4.5 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండితే ఎక్కడా సక్రమంగా కొనుగోళ్లు జరగడం లేదని దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలంగాణ రైతాంగానికి తెలియ పేందుకు వరంగల్ లో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణులతో కలిసి సదస్సుకు రావాలని కేటీఆర్ ను కలిసి కోరగా వారు హాజరవుతానని హామీ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ నుంచి 10 వేల మంది రైతులతో ఈ రైతు సదస్సు జరగబోతుందని తెలిపారు.

**సభ నిర్వహణకు ప్రభుత్వం నిరాకరణ**

సభ నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు.కేసీఆర్, కుడా గ్రౌండ్ లో సభ పర్మిషన్ కోసం ప్రయత్నిస్తే అధికారులు ప్రభుత్వ ఒత్తిడి తో అనుమతులు కూడా నిరాకరించిన దుస్థితి నెలకొందని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య,ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ పేరిట రేవంత్ రెడ్డి వారి పార్టీ అధినేత రాహుల్ గాంధీని తీసుకొచ్చి వరంగల్ లో సభ పెట్టారు. రెండున్నరేళ్లైనా రైతులకు నాడు ఇచ్చిన డిక్లరేషన్ను అమలు చేయలేదని ఎన్నికలకు ముందు 420 హామీలు, 6 గ్యారంటీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల తో పాటు అన్ని వర్గాలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆయన మండిపడ్డారు.కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండగట్టేందుకు మే 6న ఓరుగల్లు వేదిక సభ పెడుతున్నామని ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు అధిక సంఖ్యలో హాజరై రైతుల సమస్యల పై పోరాడే టిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపాలని అలాగే రైతుల కోసం నిర్వహించే ఈ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, సీనియర్ నాయకులు భరత్ కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చింతల యాదగిరి, ఉడతల సారంగపాణి, జోరిక రమేష్, నాయకులు నాయిమొద్దీన్, ఎడ్ల వేణు, పులి రజినీకాంత్, బజ్జూరి వాసు, సుమిత్, సల్వాజి రవీందర్ రావు, వెంకన్న, పానుగంటి శ్రీధర్, మూటిక రాజు, సుమిత్ జోసఫ్, గౌస్ ఖాన్, ఇస్మాయిల్, బండి రజినీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అభినందించిన జిల్లా కలెక్టర్



చిన్నారులకు స్వీట్ తినిపించి ఆశీస్సులు అందజేసి అభినందనలు తెలిపారు.

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ప్రముఖ జర్నలిస్టు ఈద శ్రీనాథ్ కుమార్తెల లో ప్రథమ కుమార్తె ఈద హర్షిని ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాల లో ఇంటర్ పూర్తి చేశారు. కాగా ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ వార్షిక పరీక్షా ఫలితాల్లో 971 ఉత్తమ శ్రేణిలో మార్కులు రాగా అలాగే ద్వితీయ పుత్రిక ఈద హరిణి బుధవారం విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 574 మార్కుల తో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఫస్ట్ వచ్చిన సందర్భంగా వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

## చిన్నారులను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని ప్రముఖ జర్నలిస్టు ఈద శ్రీనాథ్ కుమార్తెలు ఇద్దరు ఉత్తమ శ్రేణి మార్కులు సాధించారు. ఇందులో ప్రథమ కుమార్తె ఈద హర్షిని ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాల లో ఇంటర్ పూర్తి చేశారు. కాగా ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ వార్షిక పరీక్ష ఫలితాల్లో 971 ఉత్తమ శ్రేణిలో మార్కులు రాగా అలాగే ద్వితీయ పుత్రిక ఈద హరిణి బుధవారం విడుదల అయిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 574 మార్కులు తో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఫస్ట్ వచ్చిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆ చిన్నారులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు స్వీట్ తినిపించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాగే ఉన్నత చదువుల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అలాగే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

### పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు

## ఎమ్మెల్యే మల్ రెడ్డి శుభాకాంక్షలు

**పిల్లల్ని ఒత్తిడికి గురిచేయవద్దని తల్లిదండ్రులకు సూచన**



శ్రద్ధతో నియోజకవర్గ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జీవితంలో తొలిమెట్టు లాంటి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులంతా తమ జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ లక్ష్యాలు, ఆశయాలను పిల్లలపై మోపి, ఒత్తిడికి గురిచేయవద్దని.... ప్రతిభకు మార్కులు మాత్రమే ప్రామాణికం కాదని చెప్పారు. విజయానికి ఓటమి తొలిమెట్టులాంటిదని మరింత

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ భారతి లతో కలిసి హాజరై స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను విస్తరించాలని తెలిపారు. పెట్రోల్ బంకులు, డెయిరీలు, సోలార్ పవర్ ప్లాంట్లు, స్టిచింగ్, ప్లంబింగ్ వంటి రంగాల్లో మహిళలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం 100 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, సహాయక సంఘాల మహిళలు ఇందులో పాల్గొని సర్టిఫికెట్ పొందిన అనంతరం వారి నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న రంగాలను గుర్తించి సహాయక సంఘాలు తమ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన మహిళా శక్తి భవన్ను శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని, ప్యాడీ కమిషన్లో సుమారు 65 శాతం స్వయం సహాయక సంఘాలకు చేరిందని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి, వచ్చే పంట సీజన్కు అవసరమైన విత్తనాల ఎంపికలో స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉందని, జిల్లా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. మెషిన్, సెంట్రింగ్, సిమెంట్ ఇటుక యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. యూనిట్ల స్థాపనకు ఇందిరా మహిళా శక్తి పథకం, పి ఎం ఎఫ్ ఎం ఈ ద్వారా ఆర్థిక సహాయం, శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పూర్తయిన ఎస్సీ కార్పొరేషన్ లోన్ ఇంటర్వ్యూలు

**..బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు**



**బెల్లంపల్లి, మహా:** ఎస్సీ నిరుద్యోగుల సంక్షేమంపై నిర్వహించిన కార్పొరేషన్ లోన్ల ఇంటర్వ్యూలను గురువారం నాడు బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ దావస్వాతి రమేష్ బాబు తోపాటు కమిషనర్ సంపత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణానికి 30 యూనిట్ల లోన్లు కేటాయించగా ఆన్లైన్ ద్వారా 156 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 65 మంది లబ్ధిదారులు మాత్రమే హాజరయ్యారు. హాజరైన వారి అర్హత పత్రాలను, ఆర్థిక స్థితిగతులను ఇంటర్వ్యూ ద్వారా లబ్ధిదారుల నుండి సేకరించడం జరిగింది. ఎంపిక చేయబడిన లబ్ధిదారుల నివేదికను జిల్లా కలెక్టర్ కు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్, బెల్లంపల్లి ఎస్బిఐ బ్యాంక్ బజార్ ఏరియా,తెలంగాణ గ్రామీణ బ్యాంకు, హెచ్డిఎఫ్సి బ్యాంకు ,బెల్లంపల్లి ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ ఎస్బిఐ కాలిటెక్స్ ఏరియా బ్రాంచ్ లకు సంబంధించిన మేనేజర్లు మెప్మా టిఎంసి దుర్గయ్య, ఎస్సీకార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలు హాజరయ్యారు.

## అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకల్లో డిసిసి అధ్యక్షులు ఇనగాల



**మహా వరంగల్ బ్యూరో ;** హనుమకొండ నగరం సుబేదారి లోని శ్రవణ్ డాన్స్ స్టూడియోలో అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వరంగల్ కుడా చైర్మన్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టూడియోలోని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్య రీతులు ఆహుతులను అలరించాయి.ఈ సందర్భంగా ఆయన చిన్నారుల నృత్య ప్రదర్శనలను తిలకించి, వారితో కాసేపు సరదాగా గడిపారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి ముచ్చటపడిన ఆయన, వారిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## మూగజీవుల సంక్షేమం కోసం కృషి చేసిన వారికి అవార్డులు

- మూగజీవుల దాహం తీర్చండి. రాష్ట్రస్థాయిలో పశుపక్షాల రాష్ట్ర స్థాయి సేవా పురస్కార్'-2026 అవార్డు అందుకోండి
- బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్

**బెల్లంపల్లి, మహా:** మూగజీవులు, పశుపక్ష్యాదుల సంక్షేమం కోసం కృషి చేసిన వారికి అవార్డులు కేటాయించనున్నట్లు బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి పట్టణానికి వచ్చిన సందర్భంగా బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ ప్రకటన విడుదల చేసి ఆయన మాట్లాడుతూ మా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఇది వేసవికాలం కాబట్టి మూగ జీవులకు నీటిని శుభ్రమైన గింజలను అందించడం వంటి పోటీలు చిన్నారి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని పోటీల్లో పాల్గొనే వారు రాష్ట్రంలోని విద్యార్థులు ఐదో తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంత మంచి చక్కటి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి సెలవులు కాబట్టి విద్యార్థులు వారి ఇంటి వద్ద మూగజీవులకు దాహం తీర్చుటకు శుభ్రమైన గింజలు అందించుటకు ఏర్పాటు చేసే విధానము ఒక ఫోటో మూడు నిమిషాల వీడియో విద్యార్థి ఆన్లైన్ ద్వారా ఈ నెంబర్ 9 4 4 0 9 8 8 0 0 1 నెంబర్ కు వారు దిగిన ఏర్పాటుచేసిన నీటిని గింజలను తో కలిపి ఫోటోను వీడియో చిత్రీకరణ చేసి 100 అక్షరాలతో చిన్న వ్యాసాన్ని రాసి పంపించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల చిన్నారి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పశు పక్షాల సేవా పురస్కార్ 2026 అందించడం జరుగుతుందని దాంతోపాటు సర్టిఫికెట్ & మెమెంటో అందజేసి శాలువాతోను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ కన్సల్టేంట్ ఇద్దరికీ చక్కగా పంపించిన వారికి అవార్డుకు ఎంపిక చేసి బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంతమంది విద్యార్థులు పాల్గొంటారో వారికి ప్రతి ఒక్కరికి ఆన్లైన్ ద్వారా సర్టిఫికెట్ కూడా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో పశుపక్షాలను ప్రేమించడం ఒకటి... మంచి నీటిని శుభ్రమైన గింజలను అందించడంలో విద్యార్థులకు చిన్నప్పటినుండే సేవా గుణం పెంపొంది ప్రకృతి ప్రేమికులుగా మారుతారని మా బాలల హక్కుల ప్రజావేదిక యొక్క లక్ష్యం అని వెల్లడించారు . విద్యార్థుల్లో మానవ సేవ మాధవసేవాని సూక్తిని ఇనుముడింప చేసేందుకు తమ సంస్థ చేస్తున్న చిన్నపాటి కృషి అని పేర్కొన్నారు. విద్యార్థులకు వారిలో ఉన్న మానవతా విలువల సేవా గుణాలు ఏర్పాటుకు ఒక చక్కటికార్యక్రమం అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులను చుట్టుపక్క వారిని అందరిని తీసుకువచ్చి చిన్నారి విద్యార్థి చేస్తున్న కార్యక్రమాన్ని తిలకించే విధంగా చేపట్టాలని ఆయన అన్నారు అందరికీ ఇదొక మంచి కార్యక్రమంగా ముందుకు వెళుతుందని తమ బాలల హక్కుల ప్రజా వేదిక ముఖ్య ఉద్దేశం అని మా బాలల హక్కుల ప్రజా వేదిక చిన్నారి పిల్లల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చేసినట్టు ఆయన తెలిపారు. విద్యార్థులు సొంతంగా చేసిన కార్యక్రమం ఫోటోను వీడియోలు రాసిన వ్యాసాన్ని చివరి తేదీ మే ఐదో తారీఖు వరకు ఈ సెల్ నెంబర్ 9440988001 పంపించాలని విద్యార్థులను మా బాలల హక్కుల ప్రజావేదిక నుండి కోరుతున్నామన్నారు.బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమం మే 12 తేదీన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

## అరుంధతి నగర్లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం అరుంధతి నగర్లో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ నూతన ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. అరుంధతి నగర్లో నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్ ద్వారా సుమారు 130 కుటుంబాలకు స్వచ్ఛమైన మంచినీటి సదుపాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐ గోపి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు కృష్ణవేణి, రహీం పాషా, కొల పిన్ని మానస, జిల్లా జనరల్ సెక్రటరీ పోలమూరి రాజు, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస రెడ్డి, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, ఎస్. గణేష్ రెడ్డి, తిరుమలేష్, కే. అప్పారావు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**మెగా వాలీబాల్ టోర్నమెంట్..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం పగిడేరు గ్రామంలో అఖిల్ జ్ఞాపకార్థం మెగా వాలీబాల్ టోర్నమెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందించుకోవాలని సూచించారు. అఖిల్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, గుండగాని నాగేశ్వరరావు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో యువకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నర్సంపేటలో దత్తతపై అవగాహన కార్యక్రమం




- చట్టబద్ధంగానే పిల్లలను దత్తత తీసుకోవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** చైల్డ్ సేఫ్టీ వీక్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో దత్తత, ఫాస్టర్ కేర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై మాట్లాడారు.చట్ట విరుద్ధ దత్తతలు, బాలల అమ్మకం వంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇటువంటి ఘటనలు ఎవరైనా గమనించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. దత్తతను తప్పనిసరిగా చట్టబద్ధ మార్గంలోనే చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎం&హెచ్ఓ సాంబాశివరావు, డీడబ్ల్యూఓ రాజమణి, ఆర్డీఓ ఉమారాణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీసీపీఓ ఉమా, ఏహెచ్టీయూ ఇన్స్పెక్టర్ శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు
మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్
01-05-2026
మహా స్పెషల్
04



# మంగ్లీ.. మాయ

## మోసాల అడ్డాగా మారిన బ్రాండ్

- దుబాయ్ దాకా విస్తరించిన స్కామ్ మూలాలు!.. రూ. 150 కోట్లకు పైగా స్వాహా
- బాధితుల కన్నీటి గాథలు, ఆత్మహత్యల వెనుక అసలు నిజాలు!
- కర్ణాటక మాజీ మంత్రి మనవడి నుంచి రూ. 80 లక్షలు వసూల్
- గిరిజన జేఏసీ సంచలన ఆరోపణలు, తెరవెనుక బడా రాజకీయ శక్తులు!
- కాలేజ్ డ్రాపౌట్ రమావత్ మధు లగ్జరీ లైఫ్
- ఐపీఎల్ బెట్టింగ్‌లు, పబ్‌లు, స్పాల కోసం కోట్లు తగలేసిన 21 ఏళ్ల కుర్రాడి లీలలు!
- పంజాగుట్టలో సెటిల్మెంట్ దందా.. టాలీవుడ్ ప్రముఖుల ప్రమేయంపై వీడిన మిస్టరీ!
- ఎదురుదాడికి దిగిన మంగ్లీ.. నార్సింగిలో కౌంటర్ కేసులు
- తన సోదరుడిని రక్షించుకునేందుకు స్టార్ సింగర్ వేస్తున్న మాస్టర్ ప్లాన్స్!

**మహా , హైదరాబాద్:**

*సమాజంలో సెలబ్రిటీలకు ఉండే ఆదరణ, వారి పట్ల సామాన్యులకు ఉండే గుడ్డి నమ్మకం ఎంతటి భయంకరమైన ఆర్థిక విధ్వంసానికి దారితీస్తుందో చెప్పడానికి "గోకులానందన ఇన్‌ఫ్రా","శుభాక్షేత్ర" మైక్రో ఫైనాన్స్ కుంభకోణం ఒక సజీవ సాక్ష్యం. జానపద గీతాలతో, తనదైన శైలి గానంతో కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ గాయని మంగ్లీ (సత్యవతి రాథోడ్), ఇప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలను కుదిపేస్తున్న వందల కోట్ల రూపాయల భారీ ఆర్థిక మోసం కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేవలం పది కోట్ల రూపాయల మోసంగా బయటపడిన ఈ వ్యవహారం, పోలీసుల దర్యాప్తు , దర్యాప్తు జర్నలిస్టుల పరిశోధనల్లో ఏకంగా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల అంతర్జాతీయ హవాలా స్కామ్‌గా రూపాంతరం చెంది అందరినీ నివ్వెరపరుస్తోంది. ఒక 21 ఏళ్ల కాలేజ్ డ్రాపౌట్ వేసిన వలలో పడి, అత్యాశకు పోయిన వందలాది మంది అమాయకులు తమ జీవితకాల పొదుపును, పొలాలను అమ్మి నిలువునా మోసపోయారు. పెట్టుబడులు పెట్టిన వారు కన్నీరుమున్నీరవుతుంటే, నిందితులు మాత్రం ఐపీఎల్ బెట్టింగ్‌లు, పబ్‌లు, విలాసవంతమైన కార్లతో జల్సాలు చేసినట్లు పోలీసుల విచారణలో వెలుగుచూస్తోంది.

### స్టార్ సింగర్ బ్రాండ్ ఇమేజ్...తెరవెనుక సాగిన అసలు కుట్ర

సాధారణంగా ప్రజలు సినిమా తారలు, సెలబ్రిటీల పట్ల ఒక రకమైన ఆరాధన భావం కలిగి ఉంటారు. సరిగ్గా ఈ సామాజిక మనస్తత్వాన్నే ఒక పెట్టుబడిగా, ఒక ఆయుధంగా మలుచుకుని ఈ భారీ ఆర్థిక కుట్రకు తెరలేపినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మంగ్లీ కేవలం ఒక గాయని మాత్రమే కాదు, ఆమె ఒక సామాజిక వర్గానికి, ముఖ్యంగా బంజారా , గిరిజన వర్గాలకు ఒక ఐకాన్‌గా ఎదిగారు. ఒక సామాన్య తండా నుండి వచ్చి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఒక మహిళ తమ సొంత మనిషి అని, ఆమె పేరుతో నడుస్తున్న వ్యాపారంలో పెట్టుబడులు పెడితే తమ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని వందలాది మంది సామాన్యులు భావించారు. ఈ బలమైన నమ్మకమే వారి పాలిట శాపంగా మారింది. కష్టాల్లో ఉన్నప్పుడు "నేను గిరిజన బిడ్డను" అని చెప్పుకుంటూ ఆ వర్గాల సానుభూతిని పొందే ఆమె, అదే వర్గానికి చెందిన అమాయకుల కడుపు కొట్టే ఒక బృహత్తర స్కామ్‌లో భాగస్వామి అయ్యారనే ఆరోపణలు ఆ సామాజిక వర్గాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. సెలబ్రిటీల తళుకుబెళుకులు, వారు తిరిగే లగ్జరీ కార్లు, వారు హాజరయ్యే మంత్రుల పార్టీలు చూసి, వీరికి ఉన్న రాజకీయ పరపతితో తమ డబ్బుకు ఎప్పటికీ ఢోకా ఉండదని ప్రజలు భ్రమపడి, ఎటువంటి లిఖితపూర్వక హామీలు లేకుండానే కోట్ల రూపాయలు ఆయా సంస్థల ప్రతినిధుల చేతుల్లో పోశారు.

### శుభాక్షేత్ర వెంచర్ మాయాజాలం... అమాయకుల ఆకర్షణ వ్యూహం

ఈ భారీ కుంభకోణానికి పునాదులు చాలా పక్కాగా, సామాన్యుడి అత్యాశను రెచ్చగొట్టేలా వేయబడ్డాయి. ప్రధాన నిందితుడు రమావత్ మధు, భరత్ చౌహాన్, శైలజ చౌహాన్, మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ తదితరులు కలిసి "గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈ కుంభకోణంలో భాగంగా సంగారెడ్డి జిల్లా, న్యాల్కల్ మండలం, దామరగిద్దలో ఏకంగా 16 ఎకరాల భూమిలో "శుభాక్షేత్ర వెంచర్" పేరుతో ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు భారీ ఎత్తున ప్రచారం చేశారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో అత్యంత విలాసవంతమైన కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సామాన్యులను ఆకర్షించారు. వీరి స్కీమ్ ఎంత ఆకర్షణీయంగా ఉండేదంటే.. కేవలం రూ. 5 లక్షలు పెట్టుబడిగా పెడితే చాలు, వారికి 102 గజాల ప్లాట్‌ను తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని, దానికి అదనంగా ప్రతి నెలా రూ. 25 వేల చొప్పున ఏకంగా 42 నెలల పాటు లాభాలు (రిటర్న్స్) చెల్లిస్తామంటూ కళ్లు చెదిరే మాయమాటలు చెప్పారు. ఈ భ్రమలకు లోనైన మొదటి బ్యాచ్‌లోని 33 మంది బాధితుల నుంచి ప్రాథమికంగానే రూ. 6.58 కోట్లను నిందితులు అత్యంత సునాయాసంగా వసూలు చేసి జేబుల్లో వేసుకున్నారు. బ్యాంకులు కూడా ఇవ్వలేని స్థాయిలో రాబడి వస్తుందని ఆశపడిన వారు తమ సర్వస్వాన్ని తెచ్చి ఈ వెంచర్ ప్రతినిధుల చేతుల్లో పోశారు.

### వందల కోట్ల వసూళ్లు..బాధితుల గుండెల్ని పిండేసే లెక్కలు

ఈ స్కామ్‌లో బాధితులు కోల్పోయిన సొమ్ము చిన్నమొత్తం కాదు, కళ్లు బైర్లు కమ్మే వందల కోట్ల రూపాయలు. గిరిజన జేఏసీ , క్యాషియర్ రమేష్ మీడియా ముందు బయటపెట్టిన డేటా ప్రకారం, ఒక్కొక్కరు పెట్టిన పెట్టుబడుల లెక్కలు దిగ్భ్రాంతిని కలగజేస్తున్నాయి. ఇస్లావత్ జయ్ నాయక్ అనే వ్యక్తి ఏకంగా రూ. 18.52 కోట్లు, రమావత్ కోటేష్ రూ. 6.90 కోట్లు, బానావత్ భగవాన్ సుమారు రూ. 4 కోట్లు పెట్టుబడిగా పెట్టి నిలువునా మోసపోయారు. వీరితో పాటు లక్ష్మా రూ. 2.37 కోట్లు, రమావత్ హన్మా రూ. 1.42 కోట్లు, ఛత్రూ నాయక్ రూ. 1.4 కోట్లు, హన్ను నాయక్ రూ. 69 లక్షలు, పీక్యా రూ. 60.50 లక్షలు, చంద్యా నాయక్ రూ. 48 లక్షలు ఇలా వందలాది మంది లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు అప్పగించారు. ఏజెంట్ల ద్వారా మౌత్ టాక్ ద్వారా ఈ స్కీమ్ వ్యాపించడంతో నల్గొండ , ఇతర ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన అమాయకులు తమ ఉన్న కాస్త పొలాలను అమ్మి, ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ ఈ వలయంలో చిక్కుకున్నారు. పెట్టుబడులు తీసుకున్న తర్వాత నిందితులు వాగ్దానం చేసిన లాభాలు ఇవ్వకపోగా, కనీసం అసలు కూడా తిరిగి ఇవ్వడానికి నిరాకరించి అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఈ కన్నీటి గాథలు వెలుగులోకి వచ్చాయి.



### రమావత్ మధు నేపథ్యం...21 ఏళ్ల కుర్రాడి విలాసవంతమైన సామ్రాజ్యం

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యపరిచే అంశం ఏమిటంటే.. వందల కోట్ల రూపాయల కుంభకోణాన్ని నడిపించిన ప్రధాన సూత్రధారి (కింగ్ పిన్) రమావత్ మధు కేవలం 21 ఏళ్ల వయసున్న ఒక ఇంటర్మీడియట్ డ్రాపౌట్ యువకుడు కావడం. నల్గొండ జిల్లా పీఏ పల్లి మండలానికి చెందిన ఈ యువకుడు, మొదట బాలాజీ నాయక్ అనే మరో మోసగాడి వద్ద ఒక ఏజెంట్‌గా తన నేర జీవితాన్ని ప్రారంభించాడు. అనతి కాలంలోనే చట్టంలోని లొసుగులను పసిగట్టిన మధు, సొంతంగా గోకులానందన ఇన్‌ఫ్రా సంస్థను స్థాపించి సుమారు రూ. 50 కోట్లకు పైగా వసూలు చేశాడు. ఆ విధంగా వచ్చిన అమాయకుల డబ్బుతో విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాడు. ఏకంగా రూ. 2.5 కోట్ల రూపాయలు వెచ్చించి హైదరాబాద్‌లో పబ్‌లు మరియు రెండు స్పా సెంటర్లను కొనుగోలు చేశాడు. దానికి తోడు స్టాక్ మార్కెట్ ఇంట్రా డే ట్రేడింగ్‌లో రూ. 60 లక్షలు, ఆన్‌లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లలో మరో రూ. 40 లక్షలు తగలేసి వ్యాపారాల్లో తీవ్ర నష్టాల పాలయ్యాడు. లగ్జరీ కార్లలో తిరుగుతూ, పెద్ద పెద్ద కంపెనీలకు తానే ఓనర్‌ని అని తప్పుడు పత్రాలు సృష్టించి నమ్మించడం ఇతని నైజం.

### రాజకీయ లింకులు..కర్ణాటక మాజీ మంత్రి మనవడికే కుచ్చుటోపీ

ఈ మైక్రో ఫైనాన్స్ కుంభకోణం దందా కేవలం తెలుగు రాష్ట్రాల సామాన్యులకే పరిమితం కాలేదు, దీనికి బలమైన రాజకీయ , అంతరాష్ట్ర లింకులు ఉన్నాయని గిరిజన జేఏసీ నాయకులు వెల్లడించారు. గిరిజన జేఏసీ అధ్యక్షుడు సంపత్ నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మోసగాళ్ల వలలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక మాజీ మంత్రి మనవడు కూడా చిక్కుకున్నాడు. మధు , మంగ్లీ బృందం అతనికి భారీ లాభాలు ఆశచూపి ఏకంగా రూ. 80 లక్షల రూపాయల వరకు వసూలు చేశారని, దీనికి సంబంధించిన ఫోన్ సంభాషణలు (ఆడియో రికార్డింగులు) కూడా తమ వద్ద ఆధారాలుగా ఉన్నాయని సంపత్ నాయక్ బాంబు పేల్చారు. అంతేకాకుండా, మంగ్లీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని బుకాయిస్తోందని, కానీ 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె స్వయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచార గీతాలు పాడి రాజకీయ ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ రకంగా రాజకీయ వర్గాలతో ఉన్న పరిచయాలను అడ్డుపెట్టుకుని, ఈ నిందితుల ముఠా పోలీసు వ్యవస్థను సైతం మేనేజ్ చేస్తూ ఇన్నాళ్లూ స్వేచ్ఛగా చలామణి అయ్యారని ప్రతిపక్ష పార్టీలు మరియు సామాజిక హక్కుల కార్యకర్తలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు.

### న్యాయవాది సుబ్బారావు పోరాటం... డెత్ థ్రెట్స్ మరియు ఎఫ్ఐఆర్ సెక్షన్లు

బాధితులు దిక్కుతోచని స్థితిలో, ప్రాణభయంతో ఉన్నప్పుడు వారి తరపున నిలబడి న్యాయపోరాటం చేయడానికి తార్నాకకు చెందిన సీనియర్ న్యాయవాది సింగపోగు సుబ్బారావు సాహసోపేతంగా ముందుకు వచ్చారు. సుబ్బారావు రంగంలోకి దిగిన తర్వాత ఈ వ్యవహారం ఒక సాధారణ చీటింగ్ కేసు స్థాయి నుండి మాఫియా తరహా బెదిరింపుల స్థాయికి చేరుకుంది. తన క్లయింట్ల డబ్బును సామరస్యంగా తిరిగి ఇప్పించాల్సిందిగా ఒక ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ద్వారా మంగ్లీని సంప్రదించే ప్రయత్నం చేసినప్పుడు, మంగ్లీ ఆయన పట్ల అత్యంత అహంకారపూరితంగా వ్యవహరించారని, తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషించారని సుబ్బారావు పంజాగుట్ట పోలీసులకు ఇచ్చిన సుదీర్ఘమైన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అక్కడికక్కడే రమావత్ మధుతో కాన్ఫరెన్స్ కాల్ మాట్లాడిస్తూ, కేసు వెనక్కి తీసుకోకపోతే, రోడ్డు ప్రమాదం సృష్టించి దారుణంగా చంపేస్తామని కళ్లు బైర్లు కమ్మేలా మరణ శాసనాలు జారీ చేశారు. ఈ సంచలన ఫిర్యాదుల ఆధారంగా, కోర్టు ఆదేశాలతో పంజాగుట్ట పోలీసులు మంగ్లీ (సత్యవతి), ఆమె సోదరుడు శివ, రమావత్ మధు తదితరులపై నూతన క్రిమినల్ చట్టం బి ఎన్ ఎస్ లోని సెక్షన్ 318 (మోసం), సెక్షన్ 351(2) (క్రిమినల్ ఇంటిమిడేషన్ ప్రాణహాని బెదిరింపులు), సెక్షన్ 61 (క్రిమినల్ కాన్స్పిరసీ నేరపూరిత కుట్ర) కింద నాన్‌బెయిలబుల్ కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పంజాగుట్ట సెటిల్మెంట్ పంచాయితీ... టాలీవుడ్ దర్శకుడు వేణు ఉడుగుల వివరణ

విషయం చేజారిపోతోందని, మీడియా దృష్టికి వెళితే తమ సామ్రాజ్యం కూలిపోతుందని గ్రహించిన నిందితులు రాజీకి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. పంజాగుట్టలోని మరో న్యాయవాది కార్యాలయంలో జరిగిన ఒక "సెటిల్మెంట్" మీటింగ్‌కు సుబ్బారావును ఆహ్వానించారు. ఆ సమావేశంలో ఏకంగా మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్, ప్రముఖ సినీ దర్శకుడు వేణు ఉడుగుల (విరాట పర్వం ఫేమ్), సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి తదితరులు ఉన్నట్లు సుబ్బారావు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలు చిత్ర పరిశ్రమలో తీవ్ర సంచలనం రేపడంతో వెంటనే అప్రమత్తమైన దర్శకుడు వేణు ఉడుగుల మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణ ఇచ్చుకున్నారు. "మంగ్లీ వివాదంతో నా పేరు ముడిపెట్టడం నాకు తీవ్ర మనస్థాపం కలిగించింది. ఇరువర్గాలు నాకు పరిచయం ఉన్న వ్యక్తులే కావడంతో, కేవలం సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో ఒక శ్రేయోభిలాషిగా మాత్రమే ఆ మీటింగ్‌లో పాల్గొన్నాను తప్ప, ఈ గోకులానందన సంస్థ ఆర్థిక లావాదేవీలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఎఫ్ఐఆర్‌లో కూడా నా పేరు నిందితుడిగా లేదు. పోలీసు అధికారులు కూడా ఈ కేసుతో నాకు ప్రమేయం లేదని నిర్ధారించారు" అని ఆయన స్పష్టం చేస్తూ ఈ వివాదం నుండి తాను తప్పుకునే ప్రయత్నం చేశారు.

### సింగర్ మంగ్లీ ఎదురుదాడి...నార్సింగి స్టేషన్‌లో కౌంటర్ కేసులు

తమపై వచ్చిన వందల కోట్ల కుంభకోణం ఆరోపణలు జాతీయ స్థాయిలో పతాక శీర్షికలకు ఎక్కడం, పోలీసు కేసులు నమోదు కావడంతో సింగర్ మంగ్లీ తీవ్ర స్థాయిలో, వ్యూహాత్మకంగా ఎదురుదాడికి దిగారు. తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి, కేవలం తనకున్న సెలబ్రిటీ ఇమేజ్‌ను వాడుకుని కొందరు అడ్డదారిలో డబ్బు సంపాదించాలని, తనను బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. రక్షణ వ్యూహంలో భాగంగా మంగ్లీ స్వయంగా రంగంలోకి దిగి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో అడ్వకేట్ సుబ్బారావుపై సంచలన కౌంటర్ కేసు నమోదు చేశారు. తన సోదరుడు శివ చౌహాన్ కట్టల కొద్దీ డబ్బులు లెక్కిస్తున్నట్లుగా ఉన్న ఒక నకిలీ వీడియోను సృష్టించి తన కెరీర్ నాశనం చేస్తానని సుబ్బారావు బ్లాక్ మెయిల్ చేసి భారీగా డబ్బు డిమాండ్ చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. సుబ్బారావు తనను ఉద్దేశపూర్వకంగా అసభ్య పదజాలంతో దూషించారని, మహిళగా తన గౌరవానికి భంగం కలిగించారని ఆరోపిస్తూ బి ఎన్ ఎస్ సెక్షన్ 351(3) (బ్లాక్ మెయిల్ ద్వారా డబ్బు వసూలు చేసే ప్రయత్నం), సెక్షన్ 79 (మహిళ గౌరవానికి భంగం కలిగించడం), సెక్షన్ 356 (పరువు నష్టం కలిగించడం) కింద మంగ్లీ తన న్యాయవాదుల ద్వారా ఈ క్రాస్ ఫిర్యాదులను నమోదు చేయించారు.

### దుబాయ్ హవాలా నెట్‌వర్క్... అంతర్జాతీయ స్థాయికి చేరిన కుంభకోణం

ప్రారంభంలో కేవలం పది కోట్ల రూపాయల స్కామ్ అని భావించిన ఈ వ్యవహారం, రోజులు గడిచేకొద్దీ విశ్వరూపం దాల్చింది. దుబాయ్ కేంద్రంగా సాగిన హవాలా లావాదేవీలు , ఇతర అంతర్జాతీయ ఆన్‌లైన్ ట్రేడింగ్ మార్గాల ద్వారా ఈ కుంభకోణం పరిమాణం ఏకంగా 150 కోట్ల నుండి 200 కోట్ల రూపాయల స్థాయికి చేరుకుందని జాతీయ మీడియా , దర్యాప్తు సంస్థల ద్వారా సంచలన వార్తలు వెలువడ్డాయి. అమాయక ప్రజల నుండి సేకరించిన నగదును బ్లాక్ మనీగా మార్చి, ఎగుమతులు మరియు దిగుమతుల వ్యాపారం ముసుగులో హవాలా ఏజెంట్ల ద్వారా దుబాయ్ తరలించినట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ ఆ నిధులను డమ్మీ కంపెనీల పేర్లతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మరియు రియల్ ఎస్టేట్ వెంచర్లలో పెట్టుబడిగా పెట్టి వందల కోట్లు ఆర్జించినట్లు సమాచారం. ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ ఈ అంతర్జాతీయ లింకుల కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసింది. భవిష్యత్తులో ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దృష్టి సారించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## సోదరుడు శివ చౌహాన్ పాత్ర...

### మాజీ క్యాషియర్ రమేష్ సంచలన వాంగ్మూలం



ఈ కుంభకోణంలో మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ తాను కేవలం ఒక సాధారణ ఉద్యోగిని మాత్రమేనని, తనకు ఎలాంటి డైరెక్ట్ సంబంధం లేదని బుకాయిస్తున్నప్పటికీ, అదే సంస్థలో పనిచేసిన మాజీ క్యాషియర్ రమేష్ మీడియా ముందుకు వచ్చి చెప్పిన వాంగ్మూలం పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. రమావత్ మధుతో మంగ్లీకి సంబంధం లేదన్నది పచ్చి అబద్ధమని క్యాషియర్ రమేష్ గిరిజన జేఏసీ ప్రెస్ మీట్‌లో కుండబద్దలు కొట్టారు. మంగ్లీ తరచూ మియాపూర్‌లోని మధు ఆఫీసుకు స్వయంగా వచ్చేదని, వారి మధ్య ఆర్థిక , వ్యక్తిగత లావాదేవీలు విరివిగా జరిగాయని ఆయన సాక్ష్యం పలికారు. అంతేకాకుండా, మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ ఈ ఫైనాన్స్ వ్యవహారాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించేవాడని, బాధితులు పెట్టుబడులుగా తెచ్చిన కోట్ల రూపాయల నగదు అంతా శివ సమక్షంలోనే, అతని కనుసన్నల్లోనే రమావత్ మధుకు అప్పగించబడేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వాంగ్మూలం పోలీసుల దర్యాప్తులో శివ చౌహాన్‌ను ప్రధాన ముద్దాయిగా నిలబెట్టడానికి అత్యంత కీలకమైన సాక్ష్యంగా మారబోతోందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## దర్యాప్తు సంస్థల ముందున్న సవాళ్ల పర్వతం...

# న్యాయం జరిగేదెన్నడు?

సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్ అయిన తర్వాత, అరెస్టు నుండి తప్పించుకోవడానికి రమావత్ మధు అజ్ఞాతంలోకి వెళ్ళినప్పటికీ, సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మియాపూర్ పోలీసుల సాయంతో అతడిని చాకచక్యంగా అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఈ అరెస్టు ఈ కేసులో ఒక కీలక మలుపు. మధు కస్టోడియల్ విచారణలో వందల కోట్ల నిధులు ఎటు మళ్లించబడ్డాయి, రియల్ ఎస్టేట్ ముసుగులో కొనుగోలు చేసిన బినామీ ఆస్తుల వివరాలు ఏమిటి అనేది బయటపడాల్సి ఉంది. రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన ఈ క్రాస్ ఫిర్యాదులు పోలీసుల దర్యాప్తును ఒక జటిలమైన చిక్కుముడిగా మార్చాయి. మంగ్లీ చెబుతున్నట్లుగా ఆమె కేవలం బాధితురాలా, లేక గిరిజన జేఏసీ, న్యాయవాదులు ఆరోపిస్తున్నట్లుగా తెరవెనుక ఈ మొత్తం సామ్రాజ్యాన్ని నడిపించిన ప్రధాన సూత్రధారిగా ఉన్నారా అనేది రాబోయే రోజుల్లో దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, సామాన్య ప్రజల రక్తాన్ని, చెమటను పెట్టుబడిగా మార్చుకుని రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలని కలలు కనే ఇలాంటి అక్రమ మైక్రో ఫైనాన్స్ సంస్థల పట్ల ప్రభుత్వాలు కఠినమైన ఉక్కుపాదం మోపాల్సిన తక్షణ ఆవశ్యకతను ఈ కుంభకోణం కళ్లకు కట్టినట్లు చూపుతోంది.

## గిరిజన జేఏసీ ఆగ్రహ జ్వాలలు...

# మంగ్లీని కాపాడుతున్నదెవరు?

మంగ్లీ ,ఆమె సోదరుడి వ్యవహారశైలిపై గిరిజన, బంజారా సంఘాలు రగిలిపోతున్నాయి. గిరిజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ, మైక్రో ఫైనాన్స్ స్కామ్‌లో మంగ్లీకి వంద శాతం ప్రత్యక్ష ప్రమేయం ఉందని, అయినప్పటికీ పోలీసులు కేసు దర్యాప్తును ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారని, కావాలనే తాత్సారం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగ్లీ వెనుక అధికారంలో ఉన్న కొందరు బడా రాజకీయ నేతల అండదండలు ఉన్నాయని, ఆ రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు మంగ్లీని అరెస్టు చేయడానికి గానీ, కనీసం విచారించడానికి గానీ భయపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. తమ సొంత గిరిజన బిడ్డలే ప్రాణాలు తీసుకుంటుంటే కన్నీరు రాల్చని మంగ్లీ, ఇప్పుడు విచారణను ఎదుర్కోవడానికి మాత్రం తనకున్న పలుకుబడిని వాడుకుంటోందని వారు విమర్శిస్తున్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు గిరిజన కార్డు వాడుకుంటూ, లాభాలొచ్చినప్పుడు మాత్రం ఆ ప్రజలను మోసం చేయడం హేయమైన చర్య అని సామాజిక హక్కుల కార్యకర్తలు దుయ్యబడుతున్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో పోరాటాలు నిర్వహిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు.

# త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, మహా:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం గుండాల మండలం అనంతారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు.గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయనీ, అవి ఏ దశలల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు పూర్తి అయినంత వరకు లబ్దిదారుల అకౌంట్ లలో బిల్లులు వచ్చాయా అనిఅడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలి అని అన్నారు.అనంతరం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో శిదిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.గ్రామంలో ఎన్ని అంగన్వాడీ లు ఉన్నాయనీ. అందులో ఎంత ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు..హై స్కూల్ లో కొత్త అంగన్వాడీ రూమ్ నిర్మాణం కోసం కృషిచేస్తా అన్నారు.గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాల లలో ఎంత మంది గర్భిణిస్త్రీలు ఉన్నారనీ. వాళ్ళ అందరికి రెగ్యులర్ గా ప్రభుత్వ ఆసుపత్రి లలో చెకప్ లు చేయిస్తున్నారా అని ఆశ వర్కర్ లని కలెక్టర్ అడగడం జరిగింది.. డెలివరీ లు కూడా ప్రభుత్వ అసుపత్రి లలో అయ్యేలా చూడాలి అన్నారు. గ్రామంలో ఉన్న గర్భిణి స్త్రీ ఇంటికి వెళ్లి వాళ్ళ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ లో ఇచ్చే భోజనం చేస్తున్నారా అని అడిగారు. మంచి పోషకాలు ఉన్న ఆహారం తినాలి అని చెప్పారు. ఇటీవల గ్రామంలో గర్భిణీ స్త్రీ యొక్క భర్త ఆరోగ్యం బాగోలేక మరణించారాని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి.ఆమెకు ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...జిల్లా కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో అందిస్తున్న సేవలపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.డే కేర్ సెంటర్‌లో ప్రస్తుతం ఎంత మంది వయోవృద్ధులు సేవలు పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను పరిశీలించారు. అలాగే సెంటర్‌లో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఆరా తీశారు.వృద్ధులు విశ్రాంతి తీసుకునే గదులను కలెక్టర్ పరిశీలించి, పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణ పై సూచనలు ఇచ్చారు. వృద్ధులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు.. డే కేర్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ మరియు మెడికల్ సిబ్బందితో మాట్లాడి, వృద్ధులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధుల ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని, వారికి అవసరమైన అన్ని రకాల చికిత్సలు సమయానికి అందించాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- ఏ గ్రేడ్ ధాన్యాన్ని, మిల్లర్స్ బి గ్రేడ్ గా ట్రేడ్ చేస్తున్న పద్ధతి మానుకోవాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ కు రైతు సంఘం నాయకులు వినతి



**యాదాద్రి భువనగిరి, మహా:** భువనగిరి పట్టణంలోని హుస్నేన బాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారురైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలో వరి కోతలు మొదలు కాగా 25 రోజులుగా హుసేనా బాద్ లోని పిఏసిఎస్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెట్టుకుని నిలువ చేసుకున్న కొనుగోలు ప్రారంభం కాక రోజుల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారని వెంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారుబస్వాపురం ఐకెపి కేంద్రం వద్ద గత 25 రోజుల నుండి రైతులు కల్లాల నుంచి ధాన్యం తెచ్చి నిరీక్షిస్తున్నారని కొనుగోలు ప్రారంభించాలి లారీల్లో లోడింగ్ చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు లోడ్ అయిన లారీలను మిల్లు యజమానులు 24 గంటల్లోపు అన్లోడింగ్ చేసే విధంగా జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఒకవైపు గన్ని బ్యాగుల కొరత తార్పాలిన్ కవర్లు లేక రైతులు వడగళ్ల వానకు తడిసి ధాన్యం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆన్ లైన్ యాప్ రద్దుచేసి పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని కోరారు, సీజన్ దాటిపోక ముందే మే 15 నాటికి దాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి పూర్తి చేయాలని అన్నారు. 48 గంటలలోపు ధాన్యం కొనుగోలు డబ్బులని రైతుల ఖాతాలో జమ చేయాలని , తరుగు పేరుతో 2 కేజీలు, 3 కేజీలు అదనంగా తూకం వేసుకొని రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని వెంటనే ఈ దోపిడీని నివారించాలని కోరారు.అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారుజాయింట్ కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల ఎల్లయ్య, భువనగిరి పట్టణ అధ్యక్షులు బర్ల వెంకటేశం,సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ భువనగిరి మండలం రైతు సంఘం నాయకులు నరాల చంద్రయ్య, వల్దాస్ అంజయ్య, తుమ్మేటి రవి, రాసాల నిర్మల, తుమ్మేటి విజయ, దండే పోయిన పెంటయ్య, పాముల యాదగిరి, కుచ్చుల శేఖర్, కుచ్చుల లక్ష్మి, గాజ వెంకటేశం, కుచ్చుల నవీన్, దండే బోయిన వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# గాంధీలో సంజీవని

## కార్పొరేట్ స్థాయిలో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్!

నేడు ప్రారంభించనున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

అత్యాధునిక వసతులతో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటు

పేదలకు మరింత చేరువ కానున్న అవయవ మార్పిడి సేవలు

'ధాత్రి' సహకారంతో మదర్ మిల్క్ బ్యాంక్ కూడా షురూ



**హైదరాబాద్, మహా:** పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ (అవయవ మార్పిడి కేంద్రం) సేవలు నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ కేంద్రాన్ని, అలాగే చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్‌ను శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించనున్నారు.

**కార్పొరేట్‌ను తలదన్నే సదుపాయాలు**

ప్రభుత్వ ఆసుపత్రి అనగానే పెదవి విరిచే పరిస్థితిని మార్చేలా ఈ కేంద్రంలో అద్భుతమైన వసతులు కల్పించారు. ఒక విశాలమైన ఆడిటోరియంతో పాటు, 3 ప్రత్యేక ట్రాన్స్‌ప్లాంట్ ఐసోలేషన్ గదులు, 25 పడకల సామర్థ్యంతో కూడిన 3 అధునాతన ఐసీయూలను సిద్ధం చేశారు. అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసే సర్జన్లు, అనస్థీషియా నిపుణులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక లాంజ్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఇన్ఫెక్షన్ల ముప్పు లేకుండా ట్రాన్స్‌ప్లాంట్ రోగులను అత్యంత సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేకమైన లిఫ్ట్ సదుపాయాన్ని సైతం అందుబాటులోకి తెచ్చారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్ఫెక్షన్ కంట్రోల్**

అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత కీలకం. ఈ సెంటర్‌కు ఏమాత్రం విద్యుత్ అంతరాయం లేకుండా చూసేందుకు ఏకంగా ఒక ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను, పవర్ కట్ సమయంలో క్షణాల్లో ఆన్ అయ్యే ఆటోమేటిక్ పవర్ బ్యాకప్ జనరేటర్లను ఏర్పాటు చేశారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఐసోలేషన్ గదుల్లో 24 గంటల పాటు స్వచ్ఛమైన గాలి సరఫరా అయ్యేలా 9 ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లను అమర్చారు. తద్వారా ఇన్‌ఫెక్షన్ల నియంత్రణలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నారు.

**సనత్‌నగర్ టిమ్స్‌లోనూ మరో కేంద్రం**

గాంధీలో ఈ భారీ సెంటర్ ప్రారంభంతో ఇకపై అవయవ మార్పిడి, అత్యవసర చికిత్సల కోసం లక్షలు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం ప్రజలకు గణనీయంగా తప్పుతుందని వైద్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, సనత్‌నగర్‌లోని టిమ్స్ లోనూ అత్యాధునిక వసతులతో మరో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను ప్రభుత్వం శరవేగంగా ఏర్పాటు చేస్తోంది. బ్రెయిన్ డెత్ కేసుల్లో అత్యంత విలువైన అవయవాలు వృథా కాకుండా చూసేందుకు, జిల్లాల్లో సైతం ఆర్గాన్ రిట్రైవల్ (అవయవ సేకరణ) సెంటర్లను ప్రభుత్వం విస్తృతంగా నెలకొల్పుతోంది.

**అందుబాటులోకి మదర్ మిల్క్ బ్యాంక్**

ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌తో పాటే, గాంధీ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మదర్ మిల్క్ బ్యాంక్' (తల్లి పాల నిల్వ కేంద్రం)ను కూడా మంత్రి ప్రారంభించనున్నారు. 'ధాత్రి' అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రభుత్వం ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక్కడ దాతల నుంచి తల్లి పాలను సేకరించి, అత్యంత సురక్షితమైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేసేందుకు అత్యాధునిక ఏర్పాట్లు చేశారు.

# ప్రపంచ సైనిక సామ్రాజ్యంలో అగ్రగామిగా అమెరికా

- సగర్వంగా నాలుగో స్థానంలో భారత్
- పది కీలక ప్రమాణాలతో గ్లోబల్ మిలిటరీ ర్యాంకింగ్స్ వెల్లడి
- రష్యా, చైనాల తర్వాతి స్థానంలో సత్తా చాటిన మన దేశం
- దాయాది పాకిస్థాన్‌కు 14వ స్థానం.. 25వ స్థానంలో ఉక్రెయిన్
- సైనిక ఆస్తులు, సాంకేతికత, అణ్వస్త్రాల వెయిటేజీ ఆధారంగా నివేదిక



**హైదరాబాద్, మహా:** ప్రపంచ దేశాల సైనిక పాటవాన్ని, రక్షణ వ్యవస్థల బలాబలాలను కళ్లకు కట్టే సరికొత్త జాబితా విడుదలైంది. యాహూ ఫైనాన్స్ నివేదిక ఆధారంగా వెలువడిన ఈ జాబితా రక్షణ రంగంలో ఆయా దేశాల ఆధిపత్యాన్ని, అంతర్జాతీయ స్థాయిలో వాటి స్థానాన్ని స్పష్టం చేస్తోంది. అత్యంత శక్తిమంతమైన మిలిటరీ ఉన్న దేశాల జాబితాలో అగ్రరాజ్యం అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుని మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా.. ఎప్పటిలాగే రష్యా, చైనాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో భారతదేశం సగర్వంగా నాలుగో స్థానాన్ని దక్కించుకుని తన ప్రపంచస్థాయి సైనిక సత్తాను మరోసారి ఘనంగా చాటిచెప్పింది. అగ్రశ్రేణి దేశాల జాబితాను నిశితంగా పరిశీలిస్తే ఐరోపా దిగ్గజం బ్రిటన్ ఐదో స్థానంలో నిలవగా.. ఆసియాలో బలమైన సైనిక శక్తిగా నిరంతరం ఎదుగుతున్న దక్షిణ కొరియా ఆరో స్థానాన్ని దక్కించుకుంది. ఐరోపా ఖండం నుంచి ఫ్రాన్స్ ఏడు, జర్మనీ తొమ్మిది, ఇటలీ పది స్థానాల్లో నిలిచాయి. సాంకేతికంగా అత్యంత ముందుండే జపాన్ ఎనిమిదో స్థానానికే పరిమితమైంది. పశ్చిమాసియాలో చుట్టుపక్కల దేశాల నుంచి నిరంతరం దాడులు ఎదుర్కొంటూనే శత్రువులకు దీటుగా బదులిస్తున్న ఇజ్రాయెల్ 11వ స్థానంలో నిలిచి తన ఉనికిని చాటుకుంది. యూరప్, ఆసియా ఖండాల మధ్య కీలకమైన టర్కీ 12, లాటిన్ అమెరికా దేశమైన బ్రెజిల్ 13వ స్థానాల్లో నిలవగా.. దాయాది దేశం పాకిస్థాన్ 14వ స్థానంలో సరిపెట్టుకుంది. అరబ్ ప్రపంచంలో కీలకమైన ఈజిప్ట్ 15, ఇరాన్ 16, అమెరికా పొరుగు దేశమైన కెనడా 17, స్పెయిన్ 18, థాయ్‌లాండ్ 19, నెదర్లాండ్స్ 20వ స్థానాల్లో నిలిచాయి. ఆగ్నేయాసియా దేశమైన ఇండోనేషియా, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, పోలాండ్ వరుసగా 21 నుంచి 24 స్థానాల్లో నిలవగా.. సుదీర్ఘకాలంగా రష్యాతో భీకర పోరు సాగిస్తున్న ఉక్రెయిన్ 25వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ గ్లోబల్ మిలిటరీ ర్యాంకులను కేవలం సైనికుల సంఖ్యను లెక్కించి కేటాయించలేదు. ప్రతి దేశపు రక్షణ వ్యవస్థను పది అత్యంత కీలకమైన ప్రామాణికాల ఆధారంగా అత్యంత శాస్త్రీయంగా విశ్లేషించారు. భవిష్యత్తు యుద్ధాలను శాసించే, అత్యధిక విధ్వంసకర సామర్థ్యం ఉన్న అణ్వస్త్రాలకు ఈ మూల్యాంకనంలో అత్యధికంగా 15 శాతం ప్రాధాన్యం ఇచ్చారు. గగనతల ఆధిపత్యాన్ని నిర్ణయించే ఫైటర్ జెట్లతో కూడిన సైనిక విమానాలకు 15 శాతం, విశాలమైన సముద్ర మార్గాల్లో దేశ రక్షణకు కవచంలా నిలిచే నావికా దళ ఆస్తులకు 15 శాతం వెయిటేజీ ఇచ్చారు. ఆధునిక భూతల యుద్ధాల్లో కీలక పాత్ర పోషించే యుద్ధ ట్యాంకులు, ఆయా దేశాలు రక్షణ రంగానికి చేస్తున్న వ్యయం (బడ్జెట్), ఏ క్షణంలోనైనా యుద్ధానికి సన్నద్ధంగా ఉండే క్రియాశీలక సైనిక మానవ వనరులకు పదేసి శాతం చొప్పున వెయిటేజీ కేటాయించారు. సైనిక ఆయుధ సంపదతో పాటు దేశ ఆర్థిక, సాంకేతిక బలం కూడా యుద్ధ తంత్రంలో అత్యంత కీలకమని నిపుణులు భావించారు. అందుకే దేశ ఆర్థిక పటిష్టతను సూచించే స్థూల దేశీయోత్పత్తికి (జీడీపీ) ఐదు శాతం ప్రాధాన్యం ఇచ్చారు. అంతరిక్షం నుంచి నిఘా వ్యవస్థను పటిష్టం చేసే మిలిటరీ ఉపగ్రహాలు, శత్రువుల వ్యూహాలను చిత్తు చేసే అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాలు, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ యుద్ధ విమానాలను నడిపేందుకు వీలున్న యాక్టివ్ ఎయిర్‌ఫీల్డ్‌లు, తమ సరిహద్దులు దాటి ఇతర దేశాల్లో ఏర్పాటు చేసుకున్న విదేశీ సైనిక స్థావరాలకు ఐదేసి శాతం చొప్పున వెయిటేజీ ఇచ్చి ఈ నివేదికను రూపొందించారు. కేవలం సైనిక బలగాలు ఉండటమే కాకుండా.. ఆధునిక సాంకేతికత, ఆర్థిక స్థిరత్వం మేళవిస్తేనే అంతర్జాతీయ స్థాయిలో అగ్రరాజ్యంగా మనగలుగుతారనే వాస్తవాన్ని ఈ జాబితా తేటతెల్లం చేసింది. అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత దిశగా అడుగులు వేస్తున్న భారత్ భవిష్యత్తులో ఈ ర్యాంకింగ్స్‌లో మరింత పైకి ఎగబాకే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఐటీ ఉద్యోగులకు ఊరట.. ఇన్ఫోసిస్ తీపికబురు!

- ఏఐతో కొలువుల కోత లేదు.. 20 వేల మంది ఫ్రెషర్లకు అవకాశాలు
- స్పష్టం చేసిన ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్
- ఉద్యోగుల తొలగింపు ప్రసక్తే లేదని ప్రకటన
- నైపుణ్యాల పెంపు, కొత్త నియామకాలపైనే దృష్టి
- ఏఐ టెక్నాలజీపై ఉద్యోగులకు మరింత శిక్షణ



20 వేల మంది ఫ్రెషర్ల నియామకం

**హైదరాబాద్, మహా:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఐటీ రంగంలో ఉద్యోగాల కోతపై నెలకొన్న ఆందోళనలకు దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ తెరదించింది. ఐటీ నిపుణులకు, నిరుద్యోగ యువతకు ఎంతో ఊరటనిస్తూ తీపికబురు చెప్పింది. తమ సంస్థలో ఎలాంటి లేఆఫ్స్ (ఉద్యోగుల తొలగింపులు) చేపట్టబోమని, రానున్న రోజుల్లో కొత్త నియామకాలతో పాటు ఉద్యోగుల నైపుణ్యాల పెంపుపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నట్లు ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ స్పష్టం చేశారు.

**ఏఐతో ముప్పు లేదు.. మరింత శిక్షణ**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల తమ ఉద్యోగుల ఉద్యోగాలకు ఎలాంటి కోతలు ఉండబోవని సలీల్ పరేఖ్ కుండబద్దలు కొట్టారు. ఏఐ రాకతో కొలువులు పోతాయన్న ఆందోళన అవసరం లేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఏఐ సాంకేతికతపై తమ ఉద్యోగులకు మరింత మెరుగైన శిక్షణ అందిస్తామని వెల్లడించారు. నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా కంపెనీని మరింత ప్రతిష్ఠాత్మకంగా, ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా ఐటీ రంగంలోకి అడుగుపెట్టాలని కలలు కంటున్న యువతకు ఇన్ఫోసిస్ భారీ అవకాశాన్ని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) లో భారీగా నియామకాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. వివిధ దశల్లో కనీసం 20,000 మంది ఫ్రెషర్లను (కొత్తవారిని) నియమించుకోనున్నట్లు సీఈఓ వెల్లడించారు. ఇన్ఫోసిస్ తాజా ప్రకటనతో ఐటీ ఉద్యోగార్థుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి.

**ఖర్చు తగ్గింపులో ఇతర బడా కంపెనీలు..**

ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక సదుపాయాల) కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న బడా టెక్ కంపెనీలు ప్రస్తుతం భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ క్రమంలో నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా పలు సంస్థలు రీస్ట్రక్చరింగ్ (పునర్వ్యవస్థీకరణ) మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. దీంట్లో భాగంగానే ఖర్చు తగ్గింపు పేరుతో ఉద్యోగుల తొలగింపునకు పాల్పడుతున్నాయి. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లోనూ ఇన్ఫోసిస్ లేఆఫ్స్ ఉండవని ప్రకటించడం ఐటీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# హైడ్రామా.. బెయిల్ రాగానే మళ్లీ అరెస్ట్!

- కుప్పం కోర్టు ఆవరణలో ఉత్కంఠ
- పూడి శ్రీహరిని అదుపులోకి తీసుకున్న గుంటూరు పోలీసులు
- సీఎంపై అనుచిత పోస్టుల కేసులో కొనసాగుతున్న చర్యలు



**హైదరాబాద్, మహా:** సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అనుచిత పోస్టులు పెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పూడి శ్రీహరికి ఏమాత్రం ఊరట దక్కలేదు. ఒక కేసులో న్యాయస్థానం నుంచి బెయిల్ పొంది, ఊపిరి పీల్చుకునే లోపే ఆయనను పోలీసులు మరో కేసులో అదుపులోకి తీసుకున్నారు. కుప్పం కోర్టు ఆవరణలో చోటుచేసుకున్న ఈ పరిణామం తీవ్ర ఉత్కంఠ రేపింది.

**బెంగళూరులో తొలి అరెస్ట్..**

సీఎం చంద్రబాబును ఉద్దేశపూర్వకంగా కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. నిన్న బెంగళూరులో కుప్పం పోలీసులు పూడి శ్రీహరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనను భారీ బందోబస్తు మధ్య కుప్పం తీసుకువచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. విచారణ సందర్భంగా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. శ్రీహరికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన కేసు నుంచి తాత్కాలికంగా బయటపడ్డారని అంతా భావించారు.

**గజం దాటకముందే గుంటూరు పోలీసుల ఎంట్రీ..**

కానీ, అనూహ్యంగా కోర్టు ఆవరణలో హైడ్రామా చోటుచేసుకుంది. న్యాయస్థానం నుంచి బెయిల్ మంజూరైన తర్వాత ఆనందంగా బయటకు అడుగుపెడుతున్న శ్రీహరికి ఊహించని షాక్ తగిలింది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న గుంటూరు పోలీసులు.. ఆయన బయటకు రాగానే అడ్డుకున్నారు. వెంటనే ఆయన చేతికి మరో తాజా నోటీసును అందజేసి, తమ పరిధిలో నమోదైన మరో కేసులో అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఏమాత్రం సమయం ఇవ్వకుండా ఆయనను తమ వాహనంలో గుంటూరుకు తరలించారు. ఒక కేసులో కోర్టు నుంచి బెయిల్ మంజూరు కాగానే, కోర్టు గుమ్మం దాటకముందే మరో కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఈ వరుస అరెస్టులు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# సహకార వ్యవస్థపై సర్కారు కత్తి

## ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకవర్గాల రద్దు దారుణం

హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తారా?

ఎన్నికలు నిర్వహించండి.. లేదా పాత పాలకవర్గాలనే కొనసాగించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీఎస్కాబ్ మాజీ చైర్మన్ రవీందర్ రావు

సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సహకార సంఘాల ప్రతినిధుల మీడియా సమావేశం



**హైదరాబాద్, మహా:** సహకార సంఘాల పాలకవర్గాలను రద్దు చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సహకార రంగ ప్రతినిధులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకవర్గాలను రద్దు చేసి, వారి స్థానంలో నామినేటెడ్ విధానాన్ని తీసుకురావాలన్న సర్కారు నిర్ణయాన్ని వారు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల ప్రతినిధులు ప్రత్యేక మీడియా సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంక్ (టీఎస్కాబ్) మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన 597 జీవో ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని, సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 330 సహకార సంఘాలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయని రవీందర్ రావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన హైకోర్టు.. గత పాలక వర్గాలనే తిరిగి కొనసాగించాలని అత్యంత స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. అయితే, న్యాయస్థానం తీర్పు వెలువడి నాలుగు నెలలు గడుస్తున్నా.. దానిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎక్కడైనా అవకతవకలు, అక్రమాలు జరిగిన చోట మాత్రమే ప్రత్యేక అధికారులను నియమించాల్సి ఉంటుందని, కానీ ఏకంగా మొత్తం సహకార వ్యవస్థనే రద్దు చేసి నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టాలని చూడటం శోచనీయమన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది సభ్యులతో ఏకంగా 60 వేల కోట్ల రూపాయల భారీ టర్నోవర్‌తో సహకార వ్యవస్థ నడుస్తోందని, ఇందులో రాజకీయ ప్రమేయం చాలా తక్కువగా ఉండి ప్రధానంగా రైతులే సభ్యులుగా ఉన్నారన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సహకార సంఘాల పట్ల గత పాలకుల స్ఫూర్తిని కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రొఫెషనల్ బ్యాంకర్లకు సహకార వ్యవస్థలో పెద్దపీట వేశారని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని వారు గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో సహకార వ్యవస్థకు స్వతంత్రత కల్పించాలని కోరారు. సహకార సంఘాల వ్యవహారాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలన్నారు. ఒకవైపు రైతులు ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, వారికి అండగా నిలవాల్సిన సంఘ సభ్యులను పక్కనపెట్టడం తగదన్నారు. తక్షణమే సహకార సంఘాలకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో అప్పటి వరకు పాత పాలక వర్గాలనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా, ప్రజల చేత ఎన్నుకోబడిన పాలక వర్గాలను అకారణంగా తొలగించి.. వెనుక దారిలో నామినేటెడ్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏమొచ్చిందని సహకార సంఘాల ప్రతినిధులు నిలదీశారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించి హైకోర్టు తీర్పును అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సంస్కారానికి నిలువెత్తు రూపం.. మన మెగాస్టార్!

- సీనియర్ నటి శారదమ్మకు పాదాభివందనం చేసిన చిరంజీవి
- నెట్టింట వైరల్‌గా మారిన ఆత్మీయ కలయిక దృశ్యాలు



**హైదరాబాద్, మహా:** టాలీవుడ్‌లో వినయానికి, సంస్కారానికి నిలువెత్తు రూపం మెగాస్టార్ చిరంజీవి. ఆయన స్థాయి ఎంత పెరిగినా, గ్లోబల్ స్టార్‌గా ఎదిగినా.. తన మూలాలను, తనను ఆశీర్వదించిన పెద్దలను గౌరవించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు అనడానికి మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. తాజాగా ఒక ప్రైవేట్ కార్యక్రమంలో సీనియర్ నటి శారదమ్మను చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ ఆప్యాయంగా పలకరించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది.

**ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటూ..**

ఒక మహావృక్షం తన వేళ్లను ఎంతగా గౌరవిస్తుందో చెప్పడానికి ఈ దృశ్యమే సజీవ సాక్ష్యం. ఆ రద్దీ కార్యక్రమంలోనూ శారదమ్మను చూడగానే చిరంజీవి స్వయంగా వెళ్లి, ఎంతో వినయంగా వంగి పాదాభివందనం చేయడం అభిమానుల హృదయాలను హత్తుకుంటోంది. సురేఖ సైతం శారదమ్మ చేతులు పట్టుకుని ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. శారద గారు కూడా చిరంజీవిని చూడగానే ఎంతో ఆనందంతో మురిసిపోతూ ఆశీర్వదించారు. చిరంజీవిలోని ఈ వినమ్రతను చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. "మంచి మనసున్న మనిషి కాబట్టే ఆయనకు దేవుడు ఇన్ని విజయాలు ఇచ్చాడు.. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

**వెండితెరపై మరువలేని బంధం**

శారద గారు మెగాస్టార్ కెరీర్‌లో మరువలేని పాత్రలు పోషించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో దాదాపు ఏడు సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి.

న్యాయం కావాలి, అడవి దొంగ, విజేత, స్టేట్ రౌడీ, కొండవీటి దొంగ, మెకానిక్ అల్లుడు, స్టాలిన్ ఈ అద్భుత చిత్రాల్లో శారద గారు కీలక పాత్రల్లో నటించి చిరంజీవికి అండగా నిలిచారు. ముఖ్యంగా చాలా చిత్రాల్లో ఆమె చిరంజీవికి తల్లిగా నటించి మెప్పించారు. 'స్టాలిన్' సినిమాలో శారద గారు చిరంజీవికి తల్లిగా పండించిన ఎమోషన్స్ ఇప్పటికీ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో పదిలంగా ఉన్నాయి. ఆన్ స్క్రీన్ పైనే కాకుండా ఆఫ్ స్క్రీన్‌లో కూడా చిరంజీవి ఆమెను తన తల్లిలాగే భావిస్తారని ఈ ఆత్మీయ కలయిక స్పష్టం చేస్తోంది. ఆ సినిమా తర్వాత మళ్ళీ వీరిద్దరూ ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం సినీ ప్రియులకు ఒక స్వీట్ మెమరీలా అనిపిస్తోంది. "ఎంతటి గొప్ప స్థాయికి చేరుకున్నా తోటి నటీనటులను, పెద్దలను ఎలా గౌరవించాలో మెగాస్టార్ ప్రతిసారీ నిరూపిస్తుంటారు. ఆయన ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండటం పుట్టుకతో వచ్చిన గుణం." వరుస సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా..షూటింగ్స్ ఒత్తిడిలో ఉన్నా.. పాత మిత్రులను, ఆత్మీయులను పలకరించడంలో చిరంజీవి ఎప్పుడూ వెనకాడరు. తనకంటే వయసులో, అనుభవంలో పెద్దవారైన వారిని గౌరవించడంలో చిరంజీవి చూపే చొరవను టాలీవుడ్ మొత్తం కొనియాడుతోంది. శారదమ్మ పట్ల ఆయన చూపిన ఈ వినయం ఇప్పటి యువ హీరోలకు ఒక గొప్ప పాఠం లాంటిది.

# Mahaa
# First

మహా
తెలుగు దినపత్రిక
దమ్మున్న వార్తల వేదిక

## స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి






## వాయు వేగంతో

**Join Our Exclusive**
**WhatsApp Channel**

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 01-05-2026
ANN తెలుగు





## హీరోయిన్‌గా కాంట్రావర్సీ నటి కూతురు.. మెంటలెక్కిస్తోన్న జోవిక..

తమిళ సినీ రంగంలో నిత్యం వార్తల్లో నిలిచే నటి వనితా విజయ్ కుమార్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఎక్కువగా వ్యక్తిగత విషయాలతో హాట్ టాపిక్ అవుతుంది. సీనియర్ నటుడు విజయ్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె, తన నటనతో, సామాజిక అంశాలపై తన గళాన్ని వినిపిస్తూ ఎప్పుడూ చర్చల్లో ఉంటారు. తాజాగా ఆమె కుమార్తె జోవిక విజయ్ కుమార్ వెండితెరకు పరిచయం కాబోతున్నారు. 'అగాధ' అనే చిత్రంతో ఆమె హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తుంది. జోవిక ఇప్పటికే తమిళ బిగ్ బాస్ సీజన్ 7లో పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ షోలో ఆమె తన వ్యక్తిత్వాన్ని, ధైర్యాన్ని చాటుకుని ప్రేక్షకులకు దగ్గరయ్యారు.బిగ్ బాస్ నుండి బయటకు వచ్చిన తర్వాత ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తారని అందరూ ఊహించినట్లుగానే, ఇప్పుడు 'అగాధ' సినిమాతో కథానాయికగా మారుతుంది. ఈ సినిమాకు సంబంధించి తాజాగా విడుదలైన పోస్టర్లు, అప్‌డేట్స్ కోలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 'అగాధ' చిత్రం ఒక వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్నట్లు సమాచారం.ఈ సినిమాను సురేష్ అనే దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. జోవిక తన మొదటి సినిమాలోనే ఒక ఛాలెంజింగ్ పాత్రను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.తన తల్లి వనితలాగే జోవిక కూడా నటనలో తనదైన ముద్ర వేయాలని గట్టి ప్రయత్నమే చేస్తోంది. ఆమె బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకోనున్నాయి.

## మెంటలెక్కిస్తున్న సాయి మంజ్రేకర్..

"సాయి మంజ్రేకర్".. మెగా వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన 'గని' సినిమాలో హీరోయిన్ గా పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. ఇక అదే సంవత్సరంలో అడవి శేష్ హీరోగా వచ్చిన 'మేజర్' సినిమాతో సూపర్ సక్సెస్ అందుకుంది ఈ సాయి మంజ్రేకర్.ఇక ఈమెకు ఆ తరువాత ఇండస్ట్రీలో తిరుగు లేదు అనుకున్నారు అందరూ.. వెంటనే బోయపాటి సినిమాలో ఆఫర్ అందుకుంది.రామ్ పోతినేని హీరోగా మాస్ కల్ట్ చూయిస్తూ వచ్చిన స్కంద సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించింది ఈ అమ్మడు.ఇక ఏమైందో తెలియదు కానీ.. అవకాశాలు తగ్గాయి.. స్కంద సినిమానే ఈ అమ్మడి చివరి సినిమా అయ్యింది టాలీవుడ్ లో..ఇదిలా ఉంటె మరాఠీ కి చెందిన ఈ సాయి మంజ్రేకర్ పేరెంట్స్ కూడా సెలెబ్రిటీస్ అవ్వడం విశేషం.. వారు ఇండస్ట్రీ వారే..సాయి అమ్మ మేధా.. ఈమె నటిగా ఫేమౌస్.. ఈమె తండ్రి కూడా డైరెక్టర్ , ప్రొడ్యూసర్ కం యాక్టర్ మహేష్ వామన్ మంజ్రేకర్.

## చిరుత హీరోయిన్.. డబ్బు కోసం ఇదేం పని..?

బాలీవుడ్ నటి నేహా శర్మ సోషల్‌మీడియాలో విమర్శలు ఎదుర్కొంటుంది. రామ్ చరణ్ మొదటి సినిమా చిరుతతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తర్వాత కుర్రాడు మూవీ మాత్రమే తెలుగులో చేసింది. ఆ తర్వాత హిందీ పరిశ్రమలో బిజీ అయిపోయింది. అయితే, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. దీంతో యూత్‌ను తప్పుదోవ పట్టిస్తోందని ఆమెపై విమర్శలు వచ్చాయి. నేహా శర్మను సుమారు 20 లక్షల మంది ఫాలో అవుతున్నారు. కానీ, ఆమె ప్రత్యేకంగా షేర్ చేసే కంటెంట్‌ను పొందేందుకు మాత్రం 10వేల వరకు వినియోగుదారులు సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు. అందుకోసం నెలకు రూ. 299 చెల్లిస్తున్నారు. అంటే నెలకు రూ. 30 లక్షల వరకు ఆమె సంపాదిస్తుంది. అయితే, ఆమె అభిమానుల్లో కొందరు విమర్శించగా.. మరికొందరు సమర్థించారు. నేహా శర్మ ఒక ప్రతిష్ఠాత్మక కుటుంబానికి చెందినది కావడంతో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. ఆమె తండ్రి అజిత్ శర్మ రాజకీయ నాయకుడు కావడంతో నెట్టింట వైరల్ అవుతుంది. ఆర్థికంగా బాగానే ఉన్న నేహా.. ఇప్పుడు సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను ఎందుకు క్రియేట్ చేసిందంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నేహా శర్మపై ఒక యూజర్ విరుచుకుపడింది. ఇది సిగ్గుచేటు ప్రవర్తన అంటూ.. ఇలాంటి చర్యలను ఎవరూ ప్రోత్సహించకూడదని కోరింది. బహుశా ఇలాంటి వారిని ప్రోత్సహించే ప్రదేశం భారతదేశం మాత్రమే కావచ్చని అభిప్రాయ పడింది. మరొకరు ఇలా రాశారు, "ఇది ఆమెకు సులభంగా డబ్బు సంపాదించే మార్గం. పైగా, దీనికి డిమాండ్ కూడా ఉంది. ఇది విచారకరం, కానీ వాస్తవం ఇదే." అంటూ షేర్ చేశారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com